ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా
5 గురువారం, 25 ఏప్రిల్ 2024




నారా లోకేశ్‌కు రూ.15 లక్షల డీడీని అందజేసిన ఎన్‌ఆర్‌ఐ ఓర్లాండ్ విభాగం సభ్యులు

టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ఓర్లాండ్ విభాగం

రూ.15 లక్షలు విరాళం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24: అమెరికాలోని టీడీపీ ఎన్‌ఆర్‌ఐ ఓర్లాండ్ విభాగం రూ.15లక్షలు విరాళం అందజేసింది. యుఎస్‌ఏ ఫ్లోరిడాలో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ విభాగం సభ్యులు కనుమూరి ఈశ్వర్, పోట్లూరి మహేష్, స్నేహితులు ఈ విరాళాన్ని అందజేశారు. పల్నాడుజిల్లా నరసరావుపేట ఎన్‌జీవో కాలనీలో ఉంటున్న వారి బంధువుల ద్వారా ఈ విరాళాన్ని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలిసి రూ.15 లక్షల డీడీని అందజేశారు. ఈ కార్యక్రమంలో కనుమూరి ఆంజనేయులు, జాష్టి బాబు, ఈదర శ్రీనివాసరావు, సూరే రాఘవులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన పత్రాలు మార్చుకుంటున్న నాగభూషణ్ తదితరులు

విజ్ఞాన్స్ యూనివర్సిటీతో

రోబోకప్లర్ అవగాహన ఒప్పందం

గుంటూరు(విద్య), ఏప్రిల్24: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీతో వైజాగ్‌లోని రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని బుధవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రోబోకప్లర్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో ప్రవీణ్ మల్లాతో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నాగభూషణ్ అవగాహన ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ తమ యూనివర్సిటీలోని బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అడ్వాన్స్‌డ్ రోబోటిక్స్ లేబొరేటరీతో మాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు భారతదేశపు ప్రీమియర్ ఆండ్రో హ్యూమనాయిడ్ రోబోటిక్ కంపెనీ రోబోకప్లర్‌తో సంచలనాత్మక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గుక్కెడు నీళ్లివ్వండయ్యా !

● మంచినీటి కోసం మహిళల ఇబ్బందులు

దాచేపల్లి, పిడుగురాళ్ల, ఏప్రిల్ 24: భూగర్భ జలాలు అడుగంటడంతో చేతిపంపులు, విద్యుత్ మోటర్లు పనిచేయక పోవడంతో ప్రజలు తాగునీటికోసం ఇబ్బంది పడుతున్నారు. దాచేపల్లి మండలంలో వాగులు, వంకలు, చెరువులు, పల్నాడు జీవనదిగా ప్రసిద్ధి గాంచిన నాగులేరు ఎండిపోయాయి. మార్చినుంచే ఎండిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. దాచేపల్లి నగర పంచాయతీలోని ఐదు గ్రామాలు, రూరల్‌లోని 12 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి.

తాగునీటిలో కూడా రాజకీయాలు...

నీరందించే విషయంలో కూడా రాజకీయాలు చేస్తున్నారని ప్రజల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దాచేపల్లి నగర పంచాయతీ వైసీపీ నేతల ఆధ్వర్యంలో నడుస్తుంది. మున్సిపల్ చైర్మన్‌గా వైసీపీ నేత కొనసాగడంతో మున్సిపాల్టీ నుండివచ్చే వాటర్ ట్యాంకర్లు వైసీపీ అభిమానులు, నేతలు, కార్యకర్తలు అధికంగావున్న వీధుల్లోనే చక్కర్లు కొడుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. తాగే నీటి విషయంలోనూ రాజకీయాలా? వైసీపీ వాళ్లే ప్రజలా? టీడీపీ కార్యకర్తలు ప్రజలు కాదా? అంటూ మహిళలు దుమ్మెత్తి పోస్తున్నారు. తాగునీటి సమస్యపై పార్టీల రహితంగా అందరికీ నీరందించాలని టీడీపీ నాయకులు మహిళలతో కలిసి ఖాళీ బిందెలతో నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. కమిషనర్ నిబంధనల ప్రకారం తాగునీరు సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు కానీ అమలులో మాత్రం ఆచరణకు దూరంగా వుందని విమర్శలు వస్తున్నాయి. ప్రైవేటుగా వెయ్యి లీటర్ల ట్యాంకర్ కావాలంటే రూ.600 వసూలు చేస్తున్నారు. ఇప్పుడే ఇలా వుంటే మే నెలలో రానున్న రోహిణికార్తెలో నీటికష్టాలు అధికంగా వుంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


పిడుగురాళ్లలో వీధి కులాయిల వద్ద డబ్బాలో నీటిని నింపుకుంటున్న దృశ్యం


పునాదికే పరిమితమైన పిడుగురాళ్ల వాటర్ ట్యాంక్ నిర్మాణం

రెండేళ్ల అయినా గుక్కెడు మంచినీరు ఏవీ..

పిడుగురాళ్ల పట్టణంలో ఇంటింటికి తాగునీరు అందిస్తామని వైసీపీ నేతల ఆర్భాటపు ప్రకటనలే తప్ప గుక్కెడు నీళ్ల అందిస్తున్న పాపాన పోవడం లేదు. రెండేళ్ల క్రితం పిడుగురాళ్లలో మూడు వాటర్ ట్యాంక్‌ల నిర్మాణానికి శంకుస్థాపన జరిగినా నిధుల కొరతతో అవి పునాదులకే పరిమితమయ్యాయి. పట్టణంలో సుమారు 15,500కు పైగా నివాస గృహాలు వుండగా, గత ఏడాదిన్నరగా ఇంటింటికి తాగునీరు అందించే పనులు నత్తనడకన నడుస్తున్నాయి. ఏడాది లోపే ఇంటింటికి నీళ్లిస్తామన్న పాలకుల మాటలు జనం నమ్మడం లేదు.

రెండేళ్ల అయినా పునాదులకే పరిమితమైన వాటర్ ట్యాంక్ పనులు, నత్తనడకన కొనసాగుతున్న ట్యాప్ కనెక్షన్‌ల పనులు మరో ఏడాదికి పైగా పట్టే అవకాశం వుంది. ఈ వేసవిలో పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ ఏరియా, బెల్లంకొండ డొంక, డ్రైవర్స్ కాలనీ, సంజీవరెడ్డినగర్, రసూల్‌పేట, వాసవినగర్‌తో పాటు శివారు ప్రాంతాలలోనూ నీటి ఎద్దడి రావడంతో మున్సిపల్ అధికారులు వాటర్ ట్యాంకర్ల ద్వారా అందిస్తున్న నీళ్లు ఏ మూలకు సరిపోవడం లేదు. టీడీపీ నేతలు దాతలుగా మారి స్వచ్ఛందంగా వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.


దాచేపల్లిలో నీళ్ల ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్న దృశ్యం

వైసీపీ నేతల చేతివాటం

● పంచాయతీ స్థలానికి బేరసారాలు

కారంపూడి, ఏప్రిల్ 24: వైసీపీ నేతల చేతివాటంతో పంచాయతీ స్థలం కబ్జాకు గురవుతోంది. వివరాల్లోకి వేళ్తే... స్థానిక శాఖా గ్రంథాలయానికి వెళ్లే ముందుభాగాన్ని ఓ వ్యాపారి గ్యాస్ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. వైసీపీ నేత అండదండలతో పంచాయతీకి రూ.500 అద్దె కడుతున్నట్లు వ్యాపారి తన పేరుపై రశీదు పొందుతున్నాడు. ఆరు నెలల క్రితం ఆ షాపులో గ్యాస్ సిలిండర్ పేలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఆషాపును తొలగించాలని గ్రంథాలయ రీడర్స్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు, సరిహద్దు వ్యాపారులు గ్రామ పంచాయతీకి ఫిర్యాదు చేశారు. అయితే సదరు వ్యాపారి ఈ షాపును వేరే వ్యాపారి జ్యూస్ షాపునకు రూ.3500కు అద్దెకిచ్చాడు. అంతటితో ఆగక తనకు రూ.లక్షన్నర కావాలంటూ వైసీపీ బడా నేతల ద్వారా డిమాండ్ చేశాడు. కాగా ఇందులో మరో వైసీపీ ముఖ్య నేత కల్పించుకొని పంచాయతీలో రూ.500 అద్దెకట్టేలా జ్యూస్ వ్యాపారి పేరుపై రాయించాడు. వైసీపీ వర్గపోరుతో ఈ విషయం బయటకొచ్చింది. దేనికైనా సిద్ధమంటూ ఇరువురు వైసీపీ నేతలు హెచ్చరికలు కూడా చేసుకున్నారు. గ్యాస్ వెల్డింగ్ వ్యాపారి తనంతట తాను షాపు తొలగించుకుంటున్నాడు. ఈ క్రమంలోనైనా గ్రంథాలయానికి స్త్రీలు కూడా వెళ్లేందుకు మెరుగైన మార్గం కల్పించాలని అసోసియేషన్ సభ్యులు కోరుతున్నారు. కాగా జ్యూస్ వ్యాపారి తరపున నిలిచిన వైసీపీ నేత మాత్రం జ్యూస్ వ్యాపారం నిర్వహించుకునేలా చూసేలా అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. కాగా వైసీపీ నేతల చేతివాటం చర్చనీయాంశంగా మారింది.



అక్రమంగా నిర్మించిన గదిని తొలగిస్తున్న వ్యాపారి


కంకటపాలెం గ్రామంలో ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై ఉన్న వైసీపీ జెండాలు

ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై వైసీపీ జెండాలు

బాపట్ల, ఏప్రిల్ 24 : బాపట్ల మండలం కంకటపాలెం గ్రామపంచాయతీ పరిధిలోని ఓవర్ హెడ్‌ట్యాంక్‌పై వైసీపీ జెండాలు కట్టారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పటికీ కొద్దిరోజులుగా జెండాలు ఎగురుతున్న అధికారులు తొలిగించకపోవటం పట్ల అనేక విమర్శలు వస్తున్నాయి. జెండాలను తొలిగించాలని తెలుగుదేశం నాయకులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈవిషయమై ఎంపీడీవో పర్రె విజయశేఖర్ దృష్టికి తీసుకెళ్ళగా వెంటనే తొలిగిస్తామని గ్రామ కార్యదర్శిపై తగువిధంగా స్పందిస్తామన్నారు.

కోన రఘుపతిపై ఫిర్యాదు

బాపట్ల, ఏప్రిల్ 24: ప్రభుత్వ అసైన్డ్‌భూమిని ప్రైవేట్‌భూమి అని తప్పుడు సమాచారం ఇచ్చిన ఎమ్మెల్యే కోన రఘుపతి అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని కోరుతూ బహుజన సమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరరావు బుధవారం ఆర్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన కోన రఘుపతి ఆర్‌వోకు ఇచ్చిన సమాచారంలో ఈవిధంగా వివరాలు తెలియజేశారన్నారు. సదరు భూమి మార్కెట్ విలువను కూడా తప్పుడుగా చూపించారని పేర్కొన్నారు. కావున దీనిపై చట్టప్రకారం విచారణ జరిపి ఆయన అభ్యర్థిత్వాన్ని రద్దు పరిచి తగుచర్యలు తీసుకోవాలని కోరారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

దాచేపల్లి, ఏప్రిల్24: ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న మహిళను వెనుకవైపు నుంచి మరో ద్విచక్ర వాహనం వచ్చి ఢీకొనడంతో తీవ్రగాయమై వైద్య చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన బుధవారం దాచేపల్లి మండలం గామాలపాడులో జరిగింది. గ్రామానికి చెందిన సంకుల యశోదమ్మ(51) భర్త నరసయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై వ్యవసాయ పనులకు ఈ నెల 22వ తేదీన వెళ్లింది. అదే గ్రామానికి చెందిన మరో యువకుడు ద్విచక్ర వాహనంపై వచ్చి ముందువెళ్తున్న యశోదమ్మ వాహనాన్ని వెనుక వైపు ఢీకొట్టాడు. ఈ ఘటనలో గాయపడిన యశోదమ్మ గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. మృతురాలికి ఇరువురు సంతానం వున్నారు. ఈ మేరకు దాచేపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.20కి బదులు రూ.20 వేలు చెల్లింపు

● ఆన్‌బోర్డు టీటీఈకి ఫిర్యాదు చేసిన బాధిత ప్రయాణికుడు
● నగదుని వాపస్ చేయించిన రైల్వే అధికారులు

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ లావాదేవీ ద్వారా తప్పుగా బదిలీ చేసిన అదనపు నగదుని గుంటూరు రైల్వే డివిజన్ కమర్షియల్ అధికారులు సంబంధిత వెండార్ నుంచి ప్రయాణీకుడికి తిరిగి ఇప్పించి ప్రశంసలందుకొన్నారు. షేక్ షాబుల్ ఇస్లాం అనే ప్రయాణీకుడు ఈ నెల 23న సికింద్రాబాద్ నుంచి హౌరాకు ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో వెళుతూ గుంటూరు రైల్వేస్టేషన్‌లో టెట్రా పాల ప్యాకెట్‌ని కొనుగోలు చేశాడు. అలానే మరి కాసేపటికి వాటర్ బాటిల్ కొనుగోలు చేసి దానికి రూ.20 బదులు రూ. 20 వేలు నగదు బదిలీ చేశారు. ఈ విషయాన్ని కాసేపటికి ప్రయాణీకుడు తెలుసుకొని ఆన్‌బోర్డు టీటీఈకి సమాచారం ఇచ్చారు. టీటీఈ ఈ విషయాన్ని గుంటూరు కమర్షియల్ కంట్రోలర్‌కు నివేదించగా ఆయన సంబంధిత కమర్షియల్ ఇన్‌స్పెక్టర్‌ని పాల ప్యాకెట్ విక్రయించిన వెండార్ వద్దకు పంపించి యూపీఐ చెల్లింపులను తనిఖీ చేయించారు. అదనపు నగదు వెండార్ బ్యాంకు అకౌంట్‌కు జమ అయినట్లు నిర్ధారించి ఆ మొత్తాన్ని ప్రయాణీకుడు ఇస్లాంకు యూపీఐ ద్వారా చెల్లింపుచేయించారు. ఈ సందర్భంగా కమర్షియల్ అధికారులు, సిబ్బందిని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ, డీసీఎం కోఆర్డినేషన్ డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ అభినందించారు.

గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లు

మే9,10 తేదీల్లో గుంటూరు మీదగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నెంబరు 07025 కాచీగూడ - గుంటూరు రైలు మే 9వ తేదీన రాత్రి 8.30కి బయలుదేరి 11.55కి పిడుగురాళ్ల, అర్ధరాత్రి దాటాక 12.20కి సత్తెనపల్లి, 1.45కి గుంటూరు, మరుసటి రోజు ఉదయం 8గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నెంబరు. 07026 కాకినాడ టౌన్ - కాచీగూడ రైలు మే10న సాయంత్రం 5.10కి బయలుదేరి రాత్రి 10.40కి గుంటూరు, 11.23కి సత్తెనపల్లి, 11.55కి పిడుగురాళ్ల, మరుసటి రోజు వేకువజామున 4.50కి కాచీగూడ చేరుకొంటుంది.




గుంతలో కూరుకుపోయిన బస్సు వెనుకభాగం

తృటిలో తప్పిన ప్రమాదం

కారంపూడి, ఏప్రిల్24: ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు వెనుకవైపు గుంతలో కూరుకుపోయిన ఘటన మండలంలోని ఒప్పిచర్ల వద్ద బుధవారం జరిగింది. చిలకలూరిపేట డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు హైదరాబాద్ (బీహెచ్ఎల్)కు బయలుదేరింది. మార్గ మధ్యంలోని ఒప్పిచర్ల వద్ద అకస్మాత్తుగా వెనుకబాగం కొంత గుంతలో కూరుకుపోయింది. వెనుక వైపు టైర్లు ఊడిపోయి పొలాల్లోకి వెళ్లాయి. బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు దిగిపోయారు. పెద్ద ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

మనోహర్‌కు వైసీపీ కౌన్సిలర్ మద్దతు

తెనాలి రూరల్, ఏప్రిల్ 24: అధికార పార్టీ వైసీపీ కౌన్సిలర్ జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి మద్దతు తెలపడం వైసీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అదే రోజు నామినేషన్ వేస్తుండగా అధికార పార్టీకి చెందిన 31వ వార్డు కౌన్సిలర్ మానసారెడ్డి దంపతులు నామినేషన్ వేసేందుకు వెళుతున్న ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆయన విజయానికి సహకరిస్తామని చెప్పడం వైసీపీ వర్గాలను షాక్‌కు గురిచేసింది. త్వరలోనే తన అనుచరవర్గాలను కలుపుకుని జనసేన పార్టీలో చేరనున్నట్లు మనోహర్‌కు తెలిపారు. ఇదే బాటలో అధికార పార్టీకి చెందిన మరో నలుగురు కౌన్సిలర్లు వైసీపీని వీడి ఉమ్మడి పార్టీలో చేరేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఒక పక్క ఎమ్మెల్యే శివకుమార్ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ వేసేందుకు వెళుతుంటే మరో పక్క అదే పార్టీలో కీలకంగా ఉన్న నేతలు పక్క పార్టీలో చేరికల కోసం మంతనాలుజరపడం చర్చనీయాంశంగా మారింది. అయితే రానున్న రోజుల్లో పెద్ద సంఖ్యలో అధికార పార్టీని వీడి ఉమ్మడి పార్టీల అభ్యర్థులకు మద్దతు పలికేలా చేరికలు జరగనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ధూళిపాళ్ళపై 16 క్రిమినల్ కేసులు

పొన్నూరుటౌన్, ఏప్రిల్24: పొన్నూరు కూటమి అభ్యర్థి ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌పై 16 క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఎన్నికల అఫిడవిడ్‌లో పేర్కొన్నారు. ఈ 16 క్రిమినల్ కేసులు వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నమోదైనవి కావటం గమనార్హం. నరేంద్ర కుమార్ పేరుపై చరాస్తులు రూ.2,21,64,554 ఉన్నాయి. స్వగ్రామంలో 4.47 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అలాగే స్థిరాస్తుల విలువ రూ.1,66,15,772 విలువగా పేర్కొన్నారు. అలాగే రూ.9.70 లక్షలు రుణం ఉన్నట్లుగా తెలిపారు. షేర్ల రూపంలో రూ.1,44,08,748 ఉన్నట్లు ఆఫిడవిట్‌లో చెప్పారు. సతీమణి జ్యోతిర్మయి పేరు మీద రూ.1,91,30,851 చరాస్తులు, రూ.6,57,70,000 స్థిరాస్తులు అలాగే రూ.2,74,85,204 అప్పులు ఉన్నట్లు చెప్పారు. షేర్ల రూపంలో రూ.33,97,574 ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపారు.


గుంటూరు జీజీహెచ్‌లో పిల్లల వార్డును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్

గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీలు

గుంటూరు (మెడికల్), ఏప్రిల్ 24: గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలోని పిల్లలవార్డు, కాన్పుల వార్డులను బుధవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఇటీవల కాలంలో ఆసుపత్రుల్లో పిల్లల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టేందుకు ఏర్పాటు చేసిన ఆర్‌ఎఫ్‌ఐడీ పని తీరును ఆయన పరిశీలించారు. తల్లి బిడ్డ చేతులకు తగిలించిన ట్యాగ్ పని తీరును ఆయన గమనించారు. పసి బిడ్డలకు ట్యాగ్స్ అమర్చే ప్రక్రియను నర్సింగ్ సిబ్బందే నిర్వహించాలని డాక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వైకిరణ్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మీ, ఆస్పత్రి వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

పిటిషనర్లకు రక్షణ కల్పించండి

● పల్నాడు పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన అనుచరుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ పల్నాడు జిల్లా దుర్గి మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన ఎం.యేసుదానం మరో 49 మంది, అలాగే జంగమేశ్వరపాడుకు చెందిన గుమ్మ పెదరాజయ్య మరో 24మంది హైకోర్టులో వేర్వేరుగా వ్యాజ్యాలు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ సానుభూతిపరుల కుటుంబాలపై వైసీపీ నేతలు దాడి చేసి గ్రామాల నుంచి వెళ్లగొట్టారన్నారు. ప్రాణభయంతో పిటిషనర్లు ఇతర గ్రామాలకు వెళ్లి తలదాచుకున్నారన్నారు. సొంతగ్రామాలకు వెళ్లి సాధారణ జీవనం సాగించేందుకు రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. పోలీసుల తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ...పిటిషనర్లు తమ సొంత గ్రామాలకు వెళ్లి సాధారణ జీవితం గడిపేందుకు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తామన్నారు. ఈ వివరాలు నమోదు చేసిన న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి పిటిషనర్లకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించారు. వ్యాజ్యాలను పరిష్కరించారు.


టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ జయరాంను సత్కరించిన మురళీకృష్ణ తదితరులు

టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్

కోమటి జయరాంకు సత్కారం

కొల్లూరు, ఏప్రిల్ 24: టీడీపీ ఎన్నారై సెల్ కో-ఆర్డినేటర్ కోమటి జయరాంను ఆయన టీమ్ సభ్యులను టీడీపీ మండల కన్వీనర్ మైనేని మురళీకృష్ణ సత్కరించారు. బుధవారం కొల్లూరులోని టీడీపీ కార్యాలయానికి ఎన్నారై సెల్ టీమ్ సభ్యులు విచ్చేశారు. ఈ సందర్భంగా వారితో మైనేని పలు విషయాలు చర్చించారు. అనంతరం జయరాంతో పాటు ఎన్నారై టీమ్ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో కోగంటి హరిబాబు, గద్దె నాగేశ్వరరావు, గోగినేని వెంకటేష్, మున్నంగి విజయ్, కాసరనేని మోహన్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

భారీగా మద్యం దిగుమతి


ముప్పాళ్ళ ఏప్రిల్ 24: సత్తెనపల్లి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి అంబటి రాంబాబు బుధవారం నామినేషన్ వేయనున్న సందర్భంగా ఆ పార్టీ నేతలు ముప్పాళ్ళ మండలంలోకి భారీగా మద్యాన్ని దిగుమతి చేశారు. మండంలో ప్రతి పోలింగ్ బూత్‌కి 4 నుండి 5 కేసుల మద్యాన్ని ఇప్పటికే గ్రామాలలోకి తరలించారు. కొన్ని గ్రామాలలో ప్రజలను నామినేషన్‌కు సమీకరించేందుకు ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చామని ఆ పార్టీ గ్రామ స్థాయి నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. మండలంలోని ఇరుకుపాలెంకు చెందిన నాయకులు ఆటోలో తెస్తున్న మద్యాన్ని మంగళవారం రాత్రి సత్తెనపల్లి పట్టణంలో ఎన్నికల తనిఖీ బృదం పట్టుకుని 280 క్వాటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ మద్యం అంబటి రాంబాబు నామినేషన్ కార్యక్రమం నిమిత్తం పంపిణీ చేసేందుకు గ్రామాలకు తరలిస్తున్నవేనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎన్నికల అధికారులు ఇకపైనా గ్రామాలలోకి వస్తున్న ఎన్నికల తాయిలాలను పకడ్బందీగా కట్టడి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నగదు, వెండి సీజ్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 24: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు జిల్లాలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో తాడికొండ, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో రూ.1,37,000, రూ.1,30,000 నగదు, తెనాలి నియోజకవర్గంలో రూ.2,38,700 విలువ కలిగిన 3,410 గ్రాముల వెండి సీజ్ చేసినట్టు అధికారులు తెలిపారు. జిల్లాలో ఎన్నికల నేపథ్యంలో జరిగిన తనిఖీలలో ఏప్రిల్ 24వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు రూ.2,41,26,165 విలువైన నగదు, మద్యం, ఇతర వస్తువులను సీజ్ చేసినట్టు పేర్కొన్నారు.

అభివృద్ధిని విస్మరించి.. అప్పులు మిగిల్చి..

● ఇటువంటి ప్రభుత్వాన్ని సాగనంపాల్సిందే !
● 1590వ రోజుకు రైతులు ఆందోళనలు


వెంకటపాలెం శిబిరంలో మహిళల నిరసన

తుళ్లూరు, ఏప్రిల్ 24: అమరావతి అభివృద్ధిని పక్కనపెటి రాష్ట్రానికి అప్పులను మిగిల్చిన సీఎం జగన్‌రెడ్డిని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగావున్నారని రాజధాని నిర్మాణానికి భూములు త్యాగంచేసిన రైతులు అన్నారు. రాజధాని ప్రాంత ప్రజల ఆందోళనలు, నిరసన దీక్షలు బుధవారం నాటికి 1590వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఒక్కో తల మీద జగన్‌రెడ్డి రూ.3 లక్షల అప్పు పెట్టారని ఆరోపించారు. వాటికి వడ్డీలు కట్టేందుకే ప్రజలపై ధరల భారాలను, పిచ్చి పన్నులను మోపాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విధ్వంసక ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపి, అభివృద్ధి, సంక్షేమాన్ని సమర్థవంతగా అమలుచేసే నేతను ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు కొనసాగుతున్నాయి.

72,153 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 69,174 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 72,153 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 48,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17000
నెంబరు. 5	9000	14500
273	7500	13500
341	8000	16500
4884	9500	13000
సూపర్ 10	10000	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	8000	15000
దేవనూరు డీలక్స్	8500	15000
తెల్లకాయలు	5000	--

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00





బ్రహ్మారెడ్డి, యరపతినేని, మధు, శ్రీకృష్ణదేవరాయలుకు అభిమానుల యాపిల్ దండ



వినుకొండలో జీవీ నామినేషన్‌కు హాజరైన జన సందోహం

ర్యాలీలో పాల్గొన్న జీవీ ఆంజనేయులు, కన్నా, మక్కెన తదితరులు

వినుకొండ పసుపు మయం

- అట్టహాసంగా జీవీ ఆంజనేయులు నామినేషన్
- భారీగా తరలివచ్చిన జనసందోహం

వినుకొండ, ఏప్రిల్ 24: మండుటెండ అయినా మాకు లెక్కలేదంటూ జీవీ ఆంజనేయులు నామినేషన్‌కు కూటమి నాయకులు కార్యకర్తలు తరలివచ్చారు. వేలాదిగా తరలివచ్చిన జనవాహిని మధ్య కూటమి తరఫున వినుకొండ టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు బుధవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. తొలుత జీవీ దంపతులు సర్వమత ప్రార్థనలు చేశారు. పట్టణంలోని పాత శివాలయం, గుంటి ఆంజనేయస్వామి దేవాలయం, పెద్ద మసీదు, నరసరావుపేట రోడ్డులోని ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు చర్చి, శ్రీనివాసనగర్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజ, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కారంపూడి రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి జీవీ ఆంజనేయులు రోడ్‌షో ప్రారంభమైంది. ఆయనతోపాటు మాజీమంత్రి, సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జీవీ సతీమణి గోనుగుంట్ల లీలావతి, బీజేపీ నాయకులు మేడం రమేష్, యార్లగడ్డ లెనిల్, జనసేనపార్టీ నాయకులు నిశంకర శ్రీనివాసరావు, కొణిజేటి నాగశ్రీనులతో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఎక్కడ చూసిన జనం... పట్టణమంతా పసుపుమయమైంది. సంప్రదాయ నృత్యాలు, మేళతాళాలు, కళాకారుల చేసిన నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. జీవీ ఆంజనేయులు కుమారుడు గోనుగుంట్ల హరీష్ బాబు రోడ్‌షో ప్రారంభమైన దగ్గర నుంచి పూర్తయ్యేవరకు మండుటెండలో కాలినడకన కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ రోడ్‌షోలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యకర్తలు పేల్చిన బాణాసంచా మోతలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వినుకొండ నియోకజవర్గం నలుమూలల నుంచి మహిళలు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలతో వినుకొండ కిక్కిరిసిపోయింది. ఉదయం 11గంటలకు ప్రారంభమైన రోడ్ షో స్థూపం సెంటర్ మీదుగా నర్సరావుపేట రోడ్డులోని తహసీల్దార్ కార్యలయానికి చేరేసరికి మధ్యాహ్నం 2.30గంటల సమయమైంది.



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జీవీ ఆంజనేయులు

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయం..

అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వరికపూడిశల ప్రాజెక్టును తక్షణమే పూర్తిచేస్తామని జీవీ ఆంజనేయులు అన్నారు. పల్నాడు ప్రాంతానికి గోదావరి నీళ్లను తీసుకువస్తామని, వినుకొండ పట్టణ ప్రజలకు రెండు పూట్ల మంచినీరు అందిస్తామని తెలిపారు. వాటర్ గ్రిడ్ ద్వారా పల్నాడు ప్రజలకు ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేస్తామని అన్నారు. గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చేసిన అన్యాయానికి ఈ రోజు నా నామినేషన్‌కు వచ్చిన ప్రజలే నిదర్శనమని అని జీవీ అన్నారు. వినుకొండ పట్టణంలో ఎన్‌ఎస్‌పీ స్థలం హైదరాబాద్ తరహాలో పార్కు, టీటీడీ కళ్యాణ మండపం, ముస్లింల షాదిఖాన్, బీసీ, ఎస్సీ భవన్‌లు, షాపింగ్ కాంప్లెక్స్‌లతోపాటు కూరగాయల మార్కెట్ ఏర్పాటుచేస్తామని, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేస్తామని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ అహంకారైన బొల్లా బ్రహ్మనాయుడుకు వినుకొండ ప్రజలు ఓటు అనే బెత్తం ద్వారా వీపు మీద మోత మోగిస్తారని, అది ఆయనకు జూన్ 4వ తేదీన తెలుస్తుందని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయులు, జీవీ ఆంజనేయులు మంచి మనుషులు అని వారికి మీరంత అండగా ఉండి మన వినుకొండ ప్రాంతాన్ని పల్నాడు ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు.

- జూలకంటి నామినేషన్‌కు జన ప్రభంజనం
- తరలివచ్చిన నేతలు
- మాచర్లలో మార్మోగిన టీడీపీ నినాదాలు

బ్రహ్మారథం

మాచర్లటౌన్, ఏప్రిల్ 24: మాచర్ల టీడీపీ కూటమి అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్‌కి బుధవారం అశేషంగా జనం తరలివచ్చారు. మండుటెండను లెక్కచేయకుండా కారంపూడి, దుర్గి, వెల్దుర్తి, రెంటచింతల, మాచర్ల మండలాల నుంచి సుమారు 50 వేల మంది పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు రాగా మాచర్ల రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. జూలకంటి జిందాబాద్ నినాదాలతో మాచర్ల మార్మోగింది. 69 సంవత్సరాల నియోజకవర్గాల చరిత్రలో నామినేషన్‌కు ఇంత పెద్దసంఖ్యలో జనం హాజరవడం ఇదే ప్రథమమని పలువురు పేర్కొన్నారు. అణచివేతకు, దౌర్జన్యాలకు, అక్రమాలకు వ్యతిరేకంగా జన ప్రవాహం తరలివచ్చిందని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే వివిధ గ్రామాల నుంచి వచ్చే వారితో మాచర్ల నిండిపోయింది. రాయవరం జంక్షన్, రింగ్ రోడ్ సెంటర్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. తొలుత బ్రహ్మారెడ్డి తన కుటుంబసభ్యులు, నేతలు, కార్య కర్తలతో కలిసి రింగురోడ్డు సెంటర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. బ్రహ్మారెడ్డి తన నామినేషన్ పత్రాలను జనసేన జిల్లా కార్యదర్శి పులి హరి ద్వారా తహసీల్దారు కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధి కారి శ్యాంప్రసాద్‌కు అందించారు. అలాగే బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి కూడా నామినేషన్ దాఖలు చేశారు.

అడుగడుగునా పోలీసుల అడ్డంకులు

బ్రహ్మారెడ్డి నామినేషన్ ర్యాలీలో పాల్గొనేందుకు వేలాదిగా అశేష జనం మాచర్లకి వస్తుండగా పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. కారంపూడి, దుర్గి, రెంటచింతల మండలాల నుంచి పట్టణంలోకి అభిమానులు రాకుండా రాయవరం జంక్షన్లో పోలీసులు బారికేడ్లు పెట్టి అడ్డుకున్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. వెల్దుర్తి మండలం నుంచి వచ్చే అభిమానులను ఆంజనేయ స్వామి గుడి వద్ద నిలిపివేశారు. మాచర్ల మండలం నుంచి అభిమానులను కొత్తపల్లి జంక్షన్, సాగర్ చెక్‌పోస్టు వద్ద నిలిపే ప్రయత్నం చేశారు. అయినా అభిమానులు అవేవీ లెక్కచేయకుండా మండుటెండలో తరలివచ్చారు. బ్రహ్మారెడ్డి నామినేషన్ సందర్భంగా జరిగిన సభలో పలువురు మాట్లాడారు.

అభివృద్ధికి నేను.. రక్షణకు బ్రహ్మారెడ్డి: శ్రీకృష్ణదేవరాయలు

నియోజకవర్గ అభివృద్ధికి తాను.. రక్షణకు బ్రహ్మారెడ్డి తోడుగా ఉన్నామని లోక్‌సభ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మాచర్ల ప్రజలు సూరిడితో శపథం చేసినట్లుగా.. నీ ప్రతాపం నువ్వు చూపు.. మా ప్రతాపం మేము చూపుతాం.. అన్నట్లుగా తరలి వచ్చారన్నారు. మీ ఉత్సాహం, కసి చూస్తుంటే మాచర్లలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. పెద్దల సభలో ఉండాల్సిన పెద్దమనిషివి కాదంటూ పిన్నెల్లిపై గురజాల అసెంబ్లీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మండిపడ్డారు. బ్రహ్మారెడ్డి 30 వేల పైచిలుకు మెజార్టీతో గెలుస్తారన్నారు. పిన్నెల్లి అరాచకాలను శ్రీకృష్ణదేవరాయలు, బ్రహ్మారెడ్డి తాను అడ్డుకుంటామన్నారు. నియోజకవర్గంలో పిన్నెల్లి సోదరులు చేయని పాపాలు, ద్రోహాలు, దౌర్జన్యాలు లేవన్నారు. పిన్నెల్లిని నమ్మి మోసపోయిన వారు చాలా మంది ఉన్నారన్నారు. వారిని చూసైనా వైసీపీ నేతలు బుద్ధి తెచ్చుకోవాలన్నారు. రానున్నది రాష్ట్రంలో 155 సీట్లతో కూటమి అధికారంలోకి రాబో తోందని ఇప్పటికైనా వైసీపీ నేతలు మేల్కొనాలని లేదంటే తర్వాత చింతించినా ప్రయోజనం ఉండదని హితవు చెప్పారు. శాసన మండలి మాజీ చైర్మన్ షరీఫ్ మా ట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ కి డిపాజిట్లు గల్లంతవుతాయన్నా రు. కార్య క్రమంలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జీవీ రెడ్డి, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి చిరుమామిళ్ల మధుబాబు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్య క్షుడు ధారు నాయక్, యాగంటి మల్లికార్జునరావు, కొమెర దుర్గారావు, రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, కళ్లం రా మాంజిరెడ్డి, కుర్రి శివారెడ్డి, నేరేటి వీరాస్వామి, చప్పిడి రాము, జానకి రామయ్య, అబ్బిరెడ్డి, పులుసు శివారెడ్డి, యెనుముల కేశవరెడ్డి, జనసేన నేతలు నక్షత్రపు ప్రసాద్, క్రాంతి కుమార్, బీజేపీ నేత గుమ్మడి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మారెడ్డి నామినేషన్ దాఖలు చేస్తున్న హరి



నామినేషన్‌లో బస్సుపైకి ఎక్కి అభిమానుల అభివాదం



మాచర్లలో బ్రహ్మారెడ్డి నామినేషన్‌కు హాజరైన జన సందోహం

ఇదీ సంగతి..

పొన్నూరు పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇప్పించే లక్ష్యంతో 2004లో ఒక ఎన్జీవో సొసైటీని ఏర్పాటు చేశారు. సాక్షి భవన్నారాయన స్వామి దేవస్థానంకు చెందిన 18 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. సర్వే నెంబర్ 221-1 లోని ఈ భూమిని ఎకరం రూ.4 లక్షలు చొప్పున అప్పటి ఉద్యోగుల నుంచి సేకరించిన సొమ్ముతో కొనుగోలు చేశారు. 3 సెంట్లు చొప్పు న 98, 4 సెంట్లు చొప్పున 146 ప్లాట్లను ఏర్పాటు చేశా రు. అప్పట్లో ఈ విషయంలో వివాదం తలెత్తడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. అప్పట్లో వున్న చాలామంది ఉద్యోగులు పదవీ విరమణ పొందగా, కొందరు మరణించారు. కొద్దిరోజుల క్రితం ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు మార్గం సుగమం కావటంతో ఎన్జీవో నేతలు పొన్నూరు నియోజకవర్గ ప్రజాప్రతినిధిని సంప్రదించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సహకరించాలని కోరారు.

కిలాడి.. మేత



- ఉద్యోగుల ఇళ్ల స్థలాలు కాజేసిన పొన్నూరు వైసీపీ నేత
- అప్పనంగా ఆరు ప్లాట్లు.. రూ.3 కోట్లు ముడుపులు
- ముఖ్యనేత అండతో రెచ్చిపోయిన ఎన్జీవో నేతలు
- సంఘంతో సంబంధం లేని వారికి రిజిస్ట్రేషన్‌లు
- పూజారులు, అధికార పార్టీ నాయకులు, వ్యాపారులకు ప్లాట్లు

గుంటూరు, ఏప్రిల్ 24 (ఆంధ్రజ్యోతి): పొన్నూరులోని ఆ వైసీపీ నేత కన్ను పడితే అంతే. ముడుపులు అయితే ఇంటికి వెళ్ళాలి. స్థలాలు.. పొలాలు అయితే ఆయన బినామీల పేరుతో మారాలి. గడచిన ఐదేళ్ల కాలంలో ఎంత తిన్నా ఆకలి తీరని ఆయన చివరకు చిన్నా చితక ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు ఎసరు పెట్టేసారు. ఎన్జీవో(నాన్ గజిటెడ్ అసోసియేషన్)లకు చెందిన ఇళ్ల స్థలాలను తన బినామీల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అంతటితో ఆగకుండా రూ.6 కోట్లు ఖర్చుల రూపేనా వసూలు చేయించి అందులో రూ. కోట్లు ముడుపులు కింద కొట్టేశారు. నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడున్న ఎన్జీవో నేతలు రెచ్చిపోయారు. ఒక్కొక్కటి రూ.40 లక్షలు విలువ చేసే ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల ప్లాట్లను టోకున అమ్మేశారు. పూజారులు, వ్యాపారులు, వైసీపీ నాయకులను ఉద్యోగుల కింద చేర్చేసి రిజిస్ట్రేషన్‌లు చేశారు. పొన్నూరు వైసీపీ ముఖ్య మేత, ఎన్జీవో నేతలు ఆడిన ఆ ప్లాట్లాటలో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరిగింది. ఇప్పటికే రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో ఇక్కడ జరిగిన అక్రమాలపై కేస్ ఫైల్ అయ్యింది.

పక్కా సెటిల్‌మెంట్

ఎన్జీవో సంఘ నేతలు సంప్రదింపుతో అప్రమత్తం అయిన నియోజకవర్గ నేత కొన్ని ప్లాట్లు తనకు రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు. కనీసం 10 ప్లాట్లు అయినా తనకు కావాలని పట్టుపట్టారు. చివరకు 6 ప్లాట్లు, వసూలు చేసిన సొమ్ములో సగం ఇచ్చేటట్లు ఒప్పందం కుదిరింది. ఆ తర్వాత రిజిస్ట్రేషన్ ప్రక్రియకు తెరలేపారు.

అన్నీ అక్రమాలే..

నియోజకవర్గ ముఖ్య ప్రజాప్రతినిధి అండతో అక్కడి ఎన్జీవో నేతలు తోటి ఉద్యోగుల ప్రయోజనాలను తుంగలో తొక్కేశారు. అసలు ఉద్యోగులు కాని వారికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేశారు. అందుకోసం అనేక అడ్డదారులు తొక్కేశారు. ఒక్కొక్క ప్లాట్ రిజిస్ట్రేషన్‌కు ఉద్యోగుల వద్దనుంచి ఖర్చులు కింద రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షలు వరకు వసూలు చేశారు. ప్రస్తుతం అక్కడ మంచి ధర ఉండటంతో ఒక్కొక్క ప్లాట్ రూ.40 లక్షల వరకు పలుకుతుంది. దాన్ని సాకుగా చూపించి ప్రతి ఉద్యోగి వద్ద నుండి వీలైనంత ఎక్కువ గుంజేశారు. అసలు ఉద్యోగులు కాని వారికి ప్లాట్లు కట్టబెట్టారు. అందుకోసం రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. భూమి కొనుగోలుకు నగదు చెల్లించి మధ్యలో మరణించిన వారి ప్లాట్లను వారి పిల్లలకు ఇవ్వకుండా బయట అమ్మే సినట్లు తెలుస్తోంది.

అసలు ఉద్యోగులే కాదు

పొన్నూరు ఎన్జీవో నేతలు అంతులేని అక్రమాలకు తెరలేపారు. అసలు ఉద్యోగులు కాని వారికి ప్లాట్లు రిజిస్టర్ చేశారు. ఉదాహరణకు.. పోతన వెంకట్రావు పేరుతో ప్లాట్ నెంబర్: 21 ని డాక్యుమెంట్ 4705/2023 ద్వారా రిజిస్టర్ చేశారు. అతను ఎన్జీవో సంఘానికి చెందిన వారు కాదని తెలుస్తోంది. ప్లాట్ నెంబర్:211ను వి.సత్యనారాయణకు డాక్యుమెంట్ 4775/2023 ద్వారా రిజిస్టర్ చేశారు.ఆయన కూడా ఎన్జీవో కాదని తెలుస్తుంది. జాబితాలో మరొకరి పేరు ఉండగా, ఈయన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించడం గమనార ం. ఇప్పటివరకు మొత్తం 200 ప్లాట్లు వివిధ వ్యక్తుల పేరిట రిజిస్టర్ కాగా, అందులో అధిక భాగం ఇతరుల ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్‌అండ్‌బీలో పనిచేసే ఉద్యోగుల పేరిట కొన్ని ప్లాట్లు రిజిస్టర్ కాగా అదే రోజున వాటిని వేరే వారి పేరు మీదకు మార్చేశారు. నియోజకవర్గ నేత బినామీలకు అదే పద్ధతిలో రిజిస్ట్రేషన్ జరిగింది.

తిలా పాపం.. తలా పిడికెడు

మొత్తం మీద పొన్నూరు ఎన్జీవో ప్లాట్లలో భారీగానే వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారిక లెక్కలు ప్రకారం సుమారు రూ.6 కోట్ల వరకు చేతు లు మారినట్లు చెబుతున్నారు. అందు లో రూ.3 కోట్లు ముఖ్య నేతకు వెళ్లగా, మిగిలిన సొమ్ము ఎన్జీవో నాయకులు వాటా లు వేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గుంటూరులోని ఒక కార్యాలయంలో కొందరు నాయకులు డబ్బులు పంచుకునే విధానాన్ని బాధితుడు వీడియో తీసి మీడియాకు అందించారు. ఈ అక్రమాలపై అక్కడి ముఖ్య నేతలు ఇప్పటికే హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. ఉద్యోగ సంఘ నాయకులపై కూడా ఏసీబీకి ఫిర్యాదులు వెళ్లినట్లు తెలుస్తోంది.

భారీగా స్టాంప్ డ్యూటీ ఎగవేత?

ఎన్జీవో సంఘం పేరిట పొన్నూరులో జరిగిన ప్లాట్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భారీగా స్టాంపు డ్యూటీ ఎగవేసినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ ముఖ్యనేత ఒత్తిడి కి తలొగ్గిన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు నామమాత్రపు స్టాంపు డ్యూటీతో ప్లాట్లను బదలాయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి స్టాంపు డ్యూటీ మినహాయింపు పొందాలంటే ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇవ్వాలి. అటువంటిది ఇక్కడ ఏమి జరగలేదని అంటున్నారు. ఒక వేళ అటువంటి వెసులుబాటు వున్నా అది కేవలం ఎన్జీవో జాబితాలో ముందు నుంచి ఉన్నవారికి మాత్రమే వర్తిస్తుంది. ఇక్కడ ఇష్టం వచ్చినట్లుగా, జాబితాతో పనిలేకుండా ప్రక్రియ జరిగినందువల్ల స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయానికి భారీగా గండి పడినట్లు సమాచారం.

పసుపు జెండా ఎగరేస్తాం

- భారీ మెజార్టీతో గెలుస్తామన్న పుల్లారావు, అరవిందబాబు
- టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి బీ ఫారాలు అందుకున్న అభ్యర్థులు

చిలకలూరిపేట అర్బన్, నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24: భారీ మెజార్టీలతో గెలుస్తాం. నియోజకవర్గంలో పసుపు జెండా ఎగరేస్తాం.. అని ప్రత్తిపాటి పుల్లారావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు ధీమా వ్యక్తం చేశారు. కూటమి తరపున టీడీపీ అభ్యర్థులుగా చిలకలూరిపేట నుంచి ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట నుంచి డాక్టర్ చదలవాడ అరవిందబాబు పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. వీరు శ్రీకాకుళం పర్యటనలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు నుంచి బుధవారం బీ ఫారాలు అందుకున్నారు. అనంతరం చంద్రబాబు వారిని అభినందించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పుల్లారావు, అరవింద బాబు మాట్లాడుతూ భారీ మెజార్టీతో విజయం సాధించి అధినేతకు కానుకగా ఇచ్చి తీరుతామన్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతున్న కొద్దీ తెలుగుదేశం కూటమి విజయానికి చేరువగా వెళ్తుంటే ముఖ్యమంత్రి జగన్ ప్రతి అడుగు పరాజయం, పరాభవం వైపే పడుతుందని పుల్లారావు తెలిపారు. ఈ ఎన్నికలు రాజకీయ పార్టీలుగా తమ కంటే రాష్ట్ర భవిష్యత్ రీత్యా జీవన్మరణ సమస్యగా ప్రజలు గుర్తించారన్నారు. పొరపాటున మళ్లీ వైసీపీ గెలిస్తే రాష్ట్రాన్ని టోకుగా అమ్మకానికి పెట్టడానికి కూడా జగన్, ఆయన గ్యాంగ్ వెనుకాడదని తెలిపారు. ఏపీ భవిష్యత్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నరసరావుపేటను దోపిడీకి అడ్డాగా మార్చారని అరవిందబాబు ఆరోపించారు. వైసీపీ దోపిడీకి చరమగీతం పాడతామన్నారు. కూటమి గెలుపుతో అభివృద్ధికి చిరునామాగా నియోజకవర్గాన్ని మారుస్తానని హామీ ఇచ్చారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ఎన్ని అవాంతరాలు సృష్టించినా కూటమి గెలుపు తథ్యమన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, గోపిరెడ్డి అరాచకానికి చరమగీతం పాడతామన్నారు. తనపై నమ్మకంతో సీటు ఇచ్చినం దుకు తప్ప కుండా రుణం తీర్చుకుంటానని అరవింద బాబు తెలిపారు.



చంద్రబాబు నుంచి బీఫారం అందుకుంటున్న పుల్లారావు, అరవిందబాబు

జన కేతనం
ఆంధ్రజ్యోతి
పల్నాడు జిల్లా వార్తలు
8
గురువారం 25 ఏప్రిల్ 2024



మాచర్ల ర్యాలీలో అసెంబ్లీ అభ్యర్థి బ్రహ్మారెడ్డి, షరీఫ్ తదితరులు

బ్రహ్మారెడ్డి నామినేషన్‌లో జన సందోహం

మంచి నేతనే.. ఎన్నుకుంటాం

● తొలిసారి ఓటు వేస్తున్న యువత మనోగతం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 24: వారంతో తొలిసారి ఓటు వేయబోయే నవ యువత.. అభివృద్ధిలో తాము భాగస్వాములు కావాలనుకునే లక్ష్యంతో తొలిఅడుగు వేస్తున్నారు. ఎవరికి ఓటు వేయాలి? తమ భవిష్యత్తును ఎవరు తీర్చిదిద్దుతారు అనే అంశాలు దృష్టిలో ఉంచుకుని ఓటు వేస్తామని చెబుతున్నారు. అంతేకాదు రాష్ట్ర భవిష్యత్ ఏమిటి? గతంలో పనిచేసిన, ప్రస్తుత పాలకుల తీరు ఏమిటి తదితర అంశాలు నిశితంగా విశ్లేషిస్తామని చెబుతున్నారు. సంక్షేమ పథకాలతోపాటు ఆర్థిక అభివృద్ధి ముఖ్యమేనని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తొలిసారి ఓటు వేయనున్న కొంతమంది యువత తమ అభిప్రాయాలు ఆంధ్రజ్యోతిలో పంచుకున్నారు. ఆ వివరాలు ఇలా...

నాయకుడికి నిబద్ధత ఉండాలి...



తొలిసారి ఓటుహక్కు వినియోగించుకునే తాము మంచి నాయకుల్ని మంచి నాయకున్ని ఎంచుకుంటాం. మంచి నాయకుడి వల్లే అభివృద్ధికి అవకాశం ఉంటుంది. అంతేకాదు వ్యవస్థలపై సరైన అవగాహన పెంచుకోవడంతోపాటు ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకుల్ని ఎన్నుకుంటాం.

- ఏవీ హేమనందిని

ధన, కుల బలానికి అతీతంగా..



ఎన్నికల్లో ప్రధానంగా ధన, కుల బల ప్రాబల్యం అధికంగా ఉంటుంది. ఇందుకు అతీతంగా ఉన్న నాయకుల్ని ఎంచుకువాలనేది లక్ష్యం. అభివృద్ధి చేసే నాయకుల్ని ఎన్నుకంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. యువత భవిష్యత్తుకు ఆధారమైన పరిశ్రమల, ఉద్యోగ, ఉపాధి కల్పనకు భరోసా ఇచ్చేవారే కావాలి.

- ఎస్‌వీ సాయి

అధికార దర్పం ఉండకూడదు...



నాయకులకు అధికార దర్పం, అవినీతి ఉండకూడదు. అధికారాన్ని సొంత దర్పాలకు, విలాసాలకు వినియోగించకుండా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులనే ఎన్నుకుంటాం. రాజధాని నిర్మాణంతోనే అన్ని రంగాల అభివృద్ధి సాధ్యమౌతుందని విశ్వసిస్తున్నాం. యువత ఓటు విలువను తెలుసుకోవడంతోపాటు దానికి విస్తృత ప్రచారం కల్పించాలి.

- షేక్ సానియా

ఓటు హక్కును బాధ్యతగా తీసుకోవాలి..



ఓటును వినియోగించుకోవడం ప్రతి పౌరుని బాధ్యత. తన ఓటు ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవడంతోపాటు దీనిని తన గెలుపుగా భావించాలి అప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుంది. తన ఓటు తన భవిష్యత్తుగా ఓటరు భావించాలి. ఐటీ పరిశ్రమలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- వి.సూర్యతేజ

ఓటు పైనే మన భవిష్యత్ ఆధారపడి ఉంది..



విజ్ఞానవంతులైన విద్యార్థులు మంచి నాయకున్ని ఎన్నుకుంటేనే సమాజం బాగుంగుంది. పరిశ్రమల ఏర్పాటుతోనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. ఆ దిశగా ఆలోచన చేసే నాయకులను మాత్రమే ఎన్నుకోవాలి.

- ఎన్.హరీష్

సంక్షేమంతోపాటు అభివృద్ధి ముఖ్యం..



ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంతోపాటు అభివృద్ధికి పాటుపడే వారినే ఎన్నుకుంటాం. రాష్ట్రంలో భిన్న రకాల పరిశ్రమల ఏర్పాటుతోనే రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తాం. డబ్బు ప్రభావానికి గురి కాకుండా ఓటును వినియోగించుకోవాలి.

- డి.అశోక్ వర్ధన్

నేటితో ముగియనున్న నామినేషన్లు

● ఇప్పటికే ప్రధాన పార్టీల అభ్యర్థులంతా దాఖలు
● వారం రోజులు కోలాహలంగా సాగిన ప్రక్రియ
● టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల ఘట్టానికి జనాదరణ
● జనం లేక వెలవెలబోయిన వైసీపీ అభ్యర్థుల ర్యాలీలు

నరసరావుపేట, ఏప్రిల్ 24: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జిల్లాలో వారంరోజుల నుంచి కొనసాగుతున్న నామినేషన్ల అంకానికి గురువారం తెరపడనుంది. ఈ నెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలైన సంగతి తెలిసిందే. చాలావరకు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పక్షాలు, స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు. రెండు మూడు సెట్లు నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీ అభ్యర్థులు ముందుజాగ్రత్తగా కుటుంబసభ్యులతో కూడా ప్రత్యేకంగా నామినేషన్లు దాఖలు చేయించారు. గురువారం చివరి రోజు కావడంతో పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే నామినేషన్ పర్వాన్ని ముగించుకున్న అభ్యర్థులంతా ప్రచారంలో దూకుడు పెంచారు. కీలకమైన స్క్రూట్నీ ఘట్టం ఈ నెల 26న జరగనుంది. ఆ తర్వాత 29 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. ఆ తదుపరి తుది పోరులో ఉండే అభ్యర్థులు, పార్టీలు, గుర్తులపై స్పష్టత రానుంది

టీడీపీలో పెరిగిన ధీమా..

నామినేషన్ల ప్రక్రియ మొదలైన దగ్గర నుంచి పసుపు సైన్యం జోరు పెంచింది. టీడీపీ అభ్యర్థుల నామినేషన్ల పర్వం ఆయా నియోజకవర్గాల్లో జనజాతరను తలపించింది. ఎండలు మండిస్తున్నా లెక్కచేయకుండా ఊహించని రీతిలో జనం తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి అభ్యర్థులకు దిష్టితీసి వీరతిలకాలు దిద్దగా, యువత బైక్ ర్యాలీలు, కేరింతలతో సందడి చేసింది. టీడీపీతో పాటు బీజేపీ, జనసేన శ్రేణులు, నేతలు అభ్యర్థుల వెంట నామినేషన్ల ర్యాలీలో పాల్గొని కూటమి ఐక్యతను చాటారు. మరోవైపు వైసీపీ అభ్యర్థుల నామినేషన్లకు కనీస స్థాయిలో కూడా జనం కరువయ్యారు. కొన్ని నియోజకవర్గాల్లో అయితే నామినేషన్ల పర్వాన్ని వాయిదా కూడా వేసుకోవాల్సి వచ్చిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. దీంతో ఆ పార్టీ శ్రేణుల్లో నైరాశ్యం ఆవరించిందని ఆ పార్టీ నేతలు వాపోతున్నారు.

176 నామినేషన్లు

జిల్లాలోని లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలకు ఇప్పటివరకు 176 నామినేషన్లు దాఖలయ్యాయి. బుధవారం అత్యధికంగా 64మంది నామినేషన్లు వేశారు. నరసరావుపేట లోక్‌సభ స్థానానికి పదిమంది నామినేషన్లు దాఖలు చేశారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లకుగాను 54 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక ఇప్పటివరకు అసెంబ్లీ స్థానాలను చూస్తే చిలకలూరిపేట, పెదకూరపాడు, మాచర్ల, గురజాలలో ఏడు చొప్పున, వినుకొండలో ఆరు, సత్తెనపల్లిలో తొమ్మిది, నరసరావుపేటలో పది నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం ఒక్క రోజే నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో పెద్ద సంఖ్యలో అభ్యర్థులు నామినేషన్లు వేసే అవకాశం ఉందని సమాచారం. వినుకొండ, మాచర్లలో టీడీపీ కూటమి అభ్యర్థులు జీవీ ఆంజనేయులు, జూలకంటి బ్రహ్మారెడ్డి బుధవారం అట్టహాసంగా నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ తరఫున నరసరావుపేట లోక్‌సభ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, అసెంబ్లీ స్థానానికి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గురజాల అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి నామినేషన్‌లు దాఖలు చేశారు. పెదకూరపాడు మినహా జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. పెదకూరపాడు టీడీపీ కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు.

నామినేషన్ల కోలాహలం



వినుకొండ రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న జీవీ, కన్నా, మక్కెన



రోడ్‌షోలో పాల్గొన్న భారీ జనసందోహం

భానుడు భగభగమంటున్నా.. నామినేషన్ల ఉత్సవాలు జనజాతరను తలపించాయి. బుధవారం నామినేషన్ల సందర్భంగా కూటమి అభ్యర్థులు చేపట్టిన రోడ్‌షోలతో ఆయా ప్రాంతాలు కిటకిటలాడాయి. ఎక్కడికక్కడ కూటమిశ్రేణులతో పాటు యువత, మహిళలు భారీగా తరలివచ్చారు. యువత సందడి, నేతల సత్కారాల మధ్య అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేశారు. అభ్యర్థుల ర్యాలీల్లో సంప్రదాయ డప్పు వాయిద్య కళాకారులు, మహిళల కోలాట ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

- నరసరావుపేట





చింతలపూడి గంజే షాహిద్ బాబా దర్గాలో ప్రార్థనల్లో పాల్గొన్న నరేంద్రకుమార్ తదితరులు



రేపల్లెలో నామినేషన్‌కు బయలుదేరే ముందు ఇంటి వద్ద ఎమ్మెల్యే అనగానికి హారతులు ఇస్తున్న డాక్టర్ మంజుల, కమల



నామినేషన్ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



పొన్నూరులో నరేంద్రకుమార్ నామినేషన్‌కు తరలివచ్చిన టీడీపీ, జనసేన అభిమానులు



ప్రత్యేక ప్రార్థనల్లో మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్



తెనాలిలో మనోహర్ నామినేషన్‌కు భారీగా తరలివచ్చిన ఉమ్మడి పార్టీల శ్రేణులు



సుమారు 22 మంది రెవెన్యూ డివిజన్ కార్యాలయంలోకి వెళ్తున్న దృశ్యం



బస్టాండ్‌లోకి బస్సులు రాకుండా అడ్డుపెట్టిన బారికేడ్లు

వారికో రూల్.. వీరికో రూల్!



ట్రాక్టర్ గుద్దుకోవడంతో అపస్మారక స్థితిలో ఉన్న కే స్వామిబాబు

● వైసీపీకి తొత్తులుగా అధికారులు
● ఆర్టీసీ బస్టాండ్‌లో పార్కింగ్
● తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు
● మహేష్‌రెడ్డి నామినేషన్లో ఏరులై పారిన మద్యం

గురజాలటౌన్, ఏప్రిల్ 24: గురజాల నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థికి ఒక రూలు.. వైసీపీ అభ్యర్థికి మరో రూలు విధిస్తున్నారు. ఈనెల 22వ తేదీన సోమవారం గురజాల అసెంబ్లీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. ఆ రోజు పోలీసు అధికారులు అడుగడుగునా రూల్స్ విధిస్తూ హుకుం జారీ చేశారు. టీడీపీ ఆధ్వర్యాన ఒక్క డీజే ఏర్పాటు చేయగా అనుమతి లేదంటూ దానిని కూడా నిలిపివేశారు. ఆర్డీవో కార్యాలయం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. యరపతినేనితోపాటు నలుగురిని మాత్రమే అనుమతించారు. యరపతినేని పీఏ కోటేశ్వరరావు కొన్ని పత్రాలను యరపతినేనికి ఇచ్చేందుకు వచ్చినప్పుడు అక్కడే ఉన్న ఓ సీఐ అడ్డుకున్నారు. కొన్ని పత్రాలు ఇవ్వాలి సార్ అని బతిమాలినా వినలేదు. టీడీపీ వాహనాలు మొత్తం దండివాగు వద్దనే ఆపేశారు. అనుమతి ఉన్న వాహనాలను కూడా అనుమతించలేదు.

వైసీపీ వర్తించవా..

వైసీపీ గురజాల అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి బుధవారం నామినేషన్ చేశారు. వైసీపీ నేతలు భారీగా డీజేలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సుమారు 10 డీజేలతో భారీ ధ్వనులు సృష్టించారు. మద్యం ఏరులై పారుతున్నా పట్టించుకోలేదు. పార్కింగ్ స్థలాన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేశారు. ఆర్టీసీ బస్సులను బస్టాండ్ లోపలికి రానివ్వకుండా పోలీసులు బయట నుంచే పంపించారు. ఇదిలా ఉండగా నామినేషన్ వేసేందుకు వచ్చిన కాసు మహేష్‌రెడ్డితోపాటు సుమారు 30 మంది బారికేడ్లు దాటి వచ్చారు. అయితే 22వ తేదీన విధులు నిర్వహించిన సీఐనే బుధవారం కూడా విధులు నిర్వహించారు. కాగా అక్కడే కేంద్ర బలగాలతోపాటు డీఎస్పీ స్థాయి అధికారులు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రామచంద్రరావు ఉండడం గమనార్హం. దీనిపై ఆర్డీవో కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా.. మహేష్‌రెడ్డితో పాటు మరో ముగ్గురు స్వతంత్ర్య అభ్యర్థులు నామినేషన్ వేసేందు కు వచ్చారని చెప్పారు.



ఒక చేత్తో క్వార్టర్, వాటర్ బాటిల్.. మరో చేత్తో వైసీపీ జెండాతో ర్యాలీలో ఇలా...

పక్షపాత ధోరణి..

ప్రత్తిపాడు, ఏప్రిల్ 24: ఎన్నికల సమయంలో అధికారులు పూర్తిగా పక్షపాత ధోరణిలో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల పట్ల ఒక తీరుగా.. వైసీపీ నాయకుల పట్ల ఒక తీరుగా పోలీసులు వ్యవహరిస్తున్న వైనం ఇప్పుడు ప్రత్తిపాడు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా బూర్ల రామాంజనేయులు నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రచార వాహనాన్ని అక్కడే ఆపించి, అభ్యర్థితో పాటు ఐదుగురికి అక్కడి నుండే లోపలకు అనుమతించారు. కాని వైసీపీ అభ్యర్థి విషయంలో తహసీల్దార్ కార్యాలయం వరకు అభ్యర్థి ప్రచారవాహనాన్ని అనుమతించారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆగిన వైసీపీ వాహనాలను పక్కకు పంపించే ప్రయత్నం కూడా చేయలేదు. ప్రత్తిపాడులో వైసీపీ అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్ నామినేషన్ ఫూటుగా మద్యం తాగిన యువత ఇష్టానుసారంగా వాహనాలను నడపటం ఎదుటి వ్యక్తుల ప్రాణాలమీదకు తెచ్చింది. ఈ ర్యాలీకి ట్రాక్టర్లను సైతం తెచ్చి వాటితో విన్యాసాలు చేయించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే పెదనందిపాడు మండలం అబ్బినేనిగుంటపాలేనికి చెందిన కొండేపాటి స్వామిబాబు కాలుపై ట్రాక్టర్ ఎక్కింది. ప్రస్తుతం గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. చివరికి చిన్నారులను సైతం ఇందులో భాగస్వాములను చేశారు. ఆర్వో కార్యాలయం వద్ద అభ్యర్థి ఎలాంటి ప్రచారం నిర్వహించకూడదు. కాని బలసాని కిరణ్‌కుమార్ ఆర్వో కార్యాలయం చుట్టూ తిరిగి ప్రజలకు అభివాదం చేశారు.

టీడీపీ సానుభూతి పరుల వాహనాలపై దాడి

వైసీపీ అభ్యర్థి నామినేషన్ ర్యాలీలో వైసీపీ మూక బరితెగించారు. ప్రధాన రహదారిలో ప్రయాణిస్తున్న తెలుగుదేశం పార్టీ సానుభూతి పరుల వాహనాలపై ఎగబడ్డారు. కారులో నుంచి తెలుగుదేశం పార్టీ కండువా కనిపిస్తుండంతో రెచ్చిపోయిన వైసీపీ కార్యకర్తలు కారుపై ఒక్కసారిగా ఎగబడ్డారు. దీంతో అక్కడ వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఎలాగోలా అక్కడి తప్పించుకుని వెళ్లిపోయారు.



టీడీపీ సానుభూతిపరుల వాహనంపై దాడి చేస్తున్న వైసీపీ మూక



ఆర్వో కార్యాలయం వరకు వచ్చిన వైసీపీ అభ్యర్థి ప్రచార వాహనం



భారీ వాహన శ్రేణితో బ్రహ్మారెడ్డి నామినేషన్‌కు తరలి వెళ్తున్న కూటమి నేతలు

బ్రహ్మారెడ్డికి బ్రహ్మరథం పట్టిన ప్రజలు

● నామినేషన్‌కు భారీగా తరలి వెళ్లిన కూటమి నేతలు

రెంటచింతల,ఏప్రిల్ 24 : మాచర్ల నియోజకవర్గం కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో వున్న జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బుధవారం టీడీపీ,జనసేన,బీజేపీ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు.ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చి హడావుడి చేశారు.ఎప్పటి లాగే ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లను తీసేసి హంగామా చేశారు.మండలంలోని 11 గ్రామాల నుంచి నేతలు,కార్యకర్తలు జయ జయ ధ్వానాలు చేసుకుంటూ బ్రహ్మారెడ్డి జిందా బాద్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేసుకుంటూ మాచర్లకు వెళ్లారు.ఇటీవల పార్టీలో చేరిన వారి హడావుడి అధికంగా కన్పించింది.

దుర్గి: జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్‌కు బుధవారం దుర్గి మండలం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మాచర్ల పట్టణానికి భారీగా తరలి వెళ్లారు. ఎండను సైతం లెక్కచేయకుండా భారీగా తరలివెళ్లడంతో రానున్న ఎన్నికల్లో కూటమి గెలుపు తథ్యమని చర్చించుకుంటున్నారు.

వెల్దుర్తి: జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మండల పరిధి నుంచి టీడీపీ నేతలు భారీగా వెళ్లారు. ర్యాలీలో పాల్గొని బ్రహ్మారెడ్డికి జేజేలు పలికారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి, మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, కళ్లెం రామాంజిరెడ్డి, మధు, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఏసురత్నంకు అవమానం

● నామినేషన్ కార్యక్రమంలో కనీసం పట్టించుకోని కాసు ..

● నామినేషన్ కేంద్రంలోకి పిలవకుండా వదిలి వెళ్లిన వైనం..

● చేసేది లేక అవమానభారంతో వెనుదిరిగిన చంద్రగిరి

గురజాలటౌన్, ఏప్రిల్ 24: వైసీపీలో అవమానపర్వం కొనసాగుతూనే ఉంది. పార్టీలో బీసీలకు కనీస గౌరవం కూడా దక్కడం లేదు. ఎమ్మెల్సీ జంగాను ఘోరంగా అవమానించి పార్టీ వీడే వరకు తెచ్చారు. ఇప్పుడు మరో బీసీ నేత ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంను ఘోరంగా అవమానించారు. బుధవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేసేందుకు రాగా ఆయన కాన్వాయితోపాటే ఏసురత్నం కూడా వచ్చారు. నామినేషన్ దాఖలు చేసేందుకు మహేష్‌రెడ్డి వెంట ఏసురత్నం కూడా వెళ్తారని అందరూ భావించారు. అయితే మహేష్‌రెడ్డి కనీసం ఏసురత్నంను అస్సలు పట్టించుకోలేదు. లోపలకు రమ్మని కూడా పిలవ లేదు. తనతో వచ్చిన 20 మంది అనుచరగణంతో వెళ్లిపోయారు. దీంతో ఒంటరిగి బయట మిగిలిన ఏసురత్నం చాలాసేపు కార్యాలయం ముందు వేచి ఉన్నాడు. అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో అసహనంతో మాడుగుల గ్రామానికి వెళ్లిపోయినట్లు సమాచారం. వైసీపీలో బీసీలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ వైసీపీలోనే బీసీ నేతలు చర్చించుకుంటున్నారు.

పాఠశాలా.. వైసీపీ కార్యాలయమా ?

గురజాలటౌన్, ఏప్రిల్ 24: ప్రభుత్వ పాఠశాలను వైసీపీ కార్యాలయంగా మార్చారు. బుధవారం గురజాల పట్టణంలో వైసీపీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేస్తుండడంతో మండలంలోని చర్లగుడిపాడులో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాత్రి నుంచే గేట్లు వైసీపీ నేతలు గేట్లు తెరిచారు. పాఠశాలలోకి 30 వాహనాలను తీసుకొచ్చి వాటికి జెండాలు, ఫ్లెక్సీలు కట్టడం వంటి పనులు చేశారు. పాఠశాలలో వైసీపీ కార్యక్రమాలు చేపట్టడంతో స్థానికులు తీవ్రంగా విమర్శలు గుప్పించారు.



టీడీపీ పార్టీలో చేరిన వారితో యరపతినేని శ్రీనివాసరావు

టీడీపీలోకి కొనసాగుతున్న చేరికలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 24: టీడీపీలో చేరికల పరంపర కొనసాగుతూనే వుంది. బుధవారం గురజాల మండలం బూదవాడ గ్రామానికి చెందిన వివిధ సామాజికవర్గాలలోని 20 కుటుంబాలకు పైగా వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారందరికీ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పార్టీ కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. రజక సామాజికవర్గం నుండి మక్కెన అమరకృష్ణ, కాగితవరపు సిద్దయ్య, అక్కినపల్లి అంకారావు, మరికొందరు, ఎస్సీ సామాజిక వర్గం నుండి శ్రీపతి మరియదాసు, శామ్యేలు, సైదులు, రమేష్, కొలకాని వెంకటేశ్వర్లు, అమరలింగం, మరికొందరు, కాపు సామాజికవర్గానికి చెందిన రామిశెట్టి శ్రీనివాసరావు, రామిశెట్టి చినసతీష్, తదితరులు పార్టీలో చేరారు. పులుకూరి కాంతారావు, జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, గోళ్ల నారాయణ, యానాల నాగేశ్వరరావు, కల్లూరి రాఘవ పాల్గొన్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

బెల్లంకొండ, ఏప్రిల్ 24 : కూటమి విజయం సాధిస్తే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రమైన బెల్లంకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ సుభానీ, మాజీ సర్పంచ్ జానీ, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

కూటమి గెలుపునకు ఐక్యంగా పనిచేద్దాం

ముప్పాళ్ళ ఏప్రిల్ 24: గ్రామాలలో పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ కలిసి ఐక్యంగా పనిచేసి కూటమి గెలుపునకు కృషి చేసి చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేయాలని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. మండలంలోని చాగంటివారిపాలెంలో బుధవారం ఆయన పర్యటించి కూటమి గెలుపును అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

బెల్లంకొండ, ఏప్రిల్ 24 : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా ప్రజలు సహకరించాలని పల్నాడు జిల్లా ఎస్పీ జీ బిందు మాధవ్ పేర్కొన్నారు. బుధవారం బెల్లంకొండ మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన నాగిరెడ్డి పాలెం, పాపాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఎస్పీ పరిశీలించారు. ఈసందర్భంగా ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై నిఘావుంచామని, కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద, మెయిన్ బజారులలో సీసీ కెమేరాలను ఏర్పాటుచేయాలని ఎస్ఐ రాజేష్‌కు సూచించారు. ఆయనవెంట డీఎస్పీ జగదీష్, ఎస్బీ సీఐ ప్రభాకరరావు ఉన్నారు.

300 మందికి పైగా బీసీలు హత్యకు గురయ్యారు

రాజుపాలెం,ఏప్రిల్ 24: వైసీపీ ఈ ఐదేళ్లలో 300 మందికి పైగా బీసీలు క్రూరంగా హత్యకు గురయ్యారని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దిరాల గంగాధరావు ఆరోపించారు. బుధవారం మండలంలోని రెడ్డిగూడెం, ఇనిమెట్ల, రాజుపాలెం, అనుపాలెం గ్రామాలలో ఆయన తన సామాజిక వర్గ నేతలు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత రాజుపాలెం గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో బీసీ డిక్లరేషన్ పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గంగాధరావు మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బీసీలకు ప్రత్యేక రక్షణచట్టాన్ని చంద్రబాబునాయుడు తీసుకువస్తారని తెలియజేశారు. అదేవిధంగా వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో బీసీలకు జరిగిన నష్టాన్ని, రిజర్వేషన్ శాతం తగ్గించటం వలన ఎంతమంది పదవులు కోల్పోయిన విషయాన్ని వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తుపాకుల కేశవులు, లేబాకుల బ్రహ్మయ్య, కూరపాటి రాఘురామ్ పాల్గొన్నారు.

జన ప్రభంజనం

● జూలకంటి నామినేషన్‌లో మాచర్లకు పోటెత్తిన జన ప్రవాహం

● లావు, యరపతినేనితో కలిసి రోడ్‌షో

● అడుగడుగునా బ్రహ్మరథం



ప్రజలకు నమస్కరిస్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 24: మాచర్ల నియోజకవర్గానికి టీడీపీ కూటమి అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి బుధవారం అశేషంగా జనం తరలి వచ్చారు. ఈ సందర్భంగా కూటమి నరసరావుపేట అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి నేను.. రక్షణకు బ్రహ్మారెడ్డి తోడుగా ఉన్నామని అన్నారు. మాచర్ల ప్రజలు నూరిడితో శపథం చేసినట్టుగా ఉంది.. నీ ప్రతాపం నువ్వు చూపు.. మా ప్రతాపం మేం చూపుతాం.. అన్నట్టుగా ఉందన్నారు. మీ ఉత్సాహం, కసి చూస్తుంటే మాచర్లలో టీడీపీజెండా ఎగురడం ఖాయమన్నారు. మీరంతా అభిమానం, నమ్మకం, ఈ ప్రాంతం మీద ప్రేమతో వచ్చారని, మీనమ్మకాన్ని తాను, బ్రహ్మారెడ్డి నిలబెట్టు కుంటామని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన యేడాదిలోగా వరికపూడి శెల పూర్తి చేస్తామన్నారు. ఈ ప్రాంత ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల స్థలాలు అందిస్తామని చెప్పారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.30 వేల కోట్లు ఎస్సీల అభివృద్ధికి ఖర్చు చేసే బాధ్యతను తీసుకుంటామన్నారు. బీసీల కోసం 50 ఏళ్లకే పెన్షన్, బీసీ రక్షణ చట్టం తీసుకొస్తామన్నారు. ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్, ఇమామ్ మౌలానాలకు వేతనాలు, దుల్హాన్ పథకం అమలు చేస్తామన్నారు. బ్రహ్మారెడ్డిచేతిలో రూపా యి కూడా లేనప్పటికీ మీపై నమ్మకంతో రాజకీయం చేయడానికి వచ్చారు. మరో 20 రోజులు కసిగా పనిచేయండి.. మే 13వ తేదీన సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, బ్రహ్మారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.



అభిమాన నేతపై పసుపు పూల వర్షం

గురజాల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి యరపతినేని శ్రీనివాస రావు మాట్లాడుతూ దోపిడీలు, దొంగతనాలు చేసిన విగ్రహ దొంగ లైన పిన్నెల్లి బ్రదర్స్. మరలా అధికారంలోకి వస్తాం.. పార్టీని వీడిన వారి అంతుచూస్తాం అని అంటున్నారటా.. మీ గోరజనం కరిగింది అనుకున్నాం.. ఇంకా దిగలేదని అర్థమైంది.. త్వరలోనే కరిగిస్తాం అంటూ ఆగ్రహించారు. తోట చంద్రయ్య, జల్లయ్యలను నడి బజార్లో హత్య చేశారన్నారు. ఎంతోమంది బీసీ నాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన చెందారు. టీడీపీ నేతలను పోలీస్ స్టేషన్‌లకు తీసుకెళ్లి కొట్టించారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో 155 సీట్లతో కూటమి అధికారంలోకి రాబోతోందని, జూలకంటి బ్రహ్మారెడ్డి మాచర్లలో 30 వేల పైచిలుకు మెజార్టీతో గెలుస్తారని అన్నారు.



మాచర్లను మెంచెత్తిన పసుపు దళం

మాచర్ల నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల్లి అరాచకాలను అడ్డుకునేందుకు తాను, నరసరావుపేట అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు ఉన్నామన్నారు. నియోజకవర్గంలో పిన్నెల్లి బ్రదర్స్ చేయని పాపాలు, ద్రోహాలు, దౌర్జన్యాలు లేవన్నారు. పిన్నెల్లిని నమ్మి మోస పోయిన వారు చాలామంది ఉన్నారన్నారు. వారినిచూసైనా వైసీపీ నేతలు బుద్దితెచ్చుకోవాలన్నారు. రానున్నది కూటమి ప్రభుత్వమేనని, ఇప్పటికైనా వైసీపీ నేతలు మేల్కొనాలని లేదంటే తరువాత చింతించినా ప్రయోజనం ఉండదని హితవు చెప్పారు. రాష్ట్రంలో పూర్తిగా అరాచకపాలన సాగుతోందని, ప్రధానంగా మాచర్ల నియోజకవర్గం అరాచకాలకు మోడల్‌గా ఉందన్నారు. పిన్నెల్లి సోదరులు అభివృద్ధిని మరిచి డబ్బు సంపాదించే పనిలో పడ్డారని, డబ్బుతో ప్రజల ఆత్మాభిమానం, ఆత్మగౌరవం కొనాలని చూస్తున్నారన్నారు. మేం అమ్ముడు పోయే వాళ్లం కాదు.. మిమ్మల్ని ఇంటికి పంపించే వాళ్లమని వేలాదిగా ర్యాలీకి తరలివచ్చి నిరూపించారని జనసందోహన్ని ఉద్దేశించి అన్నారు. మండుటెండలో కూడా మాచర్లలో వైసీపీ కుర్చీని మడతపెట్టారన్నారు.శ్రీకృష్ణదేవరాయలు ఈ ప్రాంతాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తనను, శ్రీకృష్ణదేవరాయలును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీకి డిపాజిట్లు గల్లంతవుతాయని శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ అన్నారు. వైసీపీ హయాంలో ముస్లింలకు అన్యాయం జరిగిందన్నారు. ముస్లింల ఓట్లు కొలగొట్టే కుట్రలు చేస్తున్నారని, ఇది దుర్మార్గమని అన్నారు. టీడీపీకి ముస్లింలు తోడుగా ఉన్నారన్నారు. టీడీపీ హయాంలో ముస్లింలకు దుల్హాన్, 4శాతం రిజర్వేషన్, రంజాన్‌తోఫా వంటి పథకాలు అమలయ్యాయని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో కూటమిని అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు.

అభివృద్ధికి పట్టం కట్టండి

● ఎన్‌డీఏ కూటమి అభివృద్ధి కన్నా లక్ష్మీనారాయణ

● విస్తృతంగా ఎన్నికల ప్రచారం

సత్తెనపల్లి, ఏప్రిల్ 24 : అచాచకం కావాలో, అభివృద్ధి కావాలో ప్రజలు ఆలోచించు కోవాలని ఎన్‌డీఏ కూటమి అభివృద్ధి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 31వ వార్డులో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం ఎజెండా సంక్షేమమని, అభివృద్ధి, ప్రజా స్వామ్య పరిరక్షణే తమ లక్ష్యం అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలను మోసం చేశారన్నారు. ప్రజల పై భారం మోపటం తప్పా చేసిందేమి లేదన్నారు. రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను, నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు. ముందుగా ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కన్నాకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటకం రామకృష్ణ, కౌన్సిలర్ తురగా మేరీ గ్రేస్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సత్తెనపల్లి పట్టణంలో 31వ వార్డులో ప్రచారంలో కన్నా లక్ష్మీనారాయణ

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

అమరావతి, ఏప్రిల్ 24: మండల పరిధిలోని లింగాపురం గ్రామంలో బుధవారం వైసీపీకి చెందిన పది కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పెదకూరపాడు నియోజకవర కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ సోదరుడు నవీన్ సమక్షంలో వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ, జనసేన నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

రాజుపాలెం,ఏప్రిల్24: నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయులను, సతైనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ లను గెలిపించాలని టీడీపీ రాజుపాలెం మండల నేతలు, కార్యకర్తలు బుధవారం మండలంలోని బీరవల్లిపాయ గ్రామంలో ఎన్నికల ప్రచా రం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన అన్యాయాన్ని, నష్టాన్నిగురించి, అలాగే కూటమి ప్రభుత్వంలో ప్రజలకు జరిగే లబ్ధి గురించి వివరిం చారు. కార్యక్రమంలో మండల టీడీపీ, జనసేన పార్టీల అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, తోట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపునుకు లీగల్ సెల్ ప్రచారం

అచ్చంపేట, ఏప్రిల్ 24 : తెలుగుదేశం పార్టీ గెలవాలంటూ టీడీపీ లీగల్ సెల్ జిల్లా కార్యదర్శి సందెపోగు బాబూరావు, న్యాయవాదులు మేదర అనీల్ కుమార్, గుర్రం పవన్ కుమార్ బుధవారం కస్తల గ్రామంలో పర్యటించారు. 72వ బూత్, 73వ బూత్‌లో తెలుగుదేశం పార్టీ ఎలా ఉదంటూ బూత్ కన్వీనర్లతో సమావేశ మై తెలుగుదేశం పార్టీ గెలిచేందుకు కృషి చేయాలని కోరారు. సూపర్ - 6 పథకానలు మరింత ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలని కోరారు.

వైసీపీ ప్రచార వాహనంపై కేసు

మాచవరం, ఏప్రిల్ 24: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసుకొని వైసీపీ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ బుధవారం తెలిపారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన నలబోతుల మణికంఠ వేమవరం గ్రామంలో తనకున్న లౌడ్ స్పీకర్లను వాహనానికి ఏర్పాటుచేసి వైసీపీ తరుపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు లౌడ్ స్పీకర్ల వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టుకు తరలించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

నామినేషన్‌లు..

సత్తెనపల్లి, ఏప్రిల్24: సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం ఎల్.రవికుమార్ స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. జాతీయ ఆంధ్రరాష్ట్రసమితి పార్టీ అభ్యర్థిగా కూరపాటి డేవిడ్ రాజు, జైభారత్ నేషనల్‌పార్టీ అభ్యర్థిగా షేక్ దరియావలి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా చుక్క చంద్రపాల్ నామినేషన్‌ను దాఖలుచేశారు. వారు తమ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణకు అందించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చుక్కా చంద్ర పాల్ నామినేషన్ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల : గురజాల అసెంబ్లీ స్థానానికి బుధవారం వైసీపీ అభ్యర్థిగా కాసు మహేష్‌రెడ్డి, టీడీపీ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తరుపున ఏసుపోగు రాంబాబు, స్వతంత్ర అభ్యర్థులుగా కొప్పారపు వెంకట పురుషోత్తమరావు, చెదిల నాగార్జున, పరిమి రామాంజనేయులు, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థిగా సంపతి వెంకట్‌యాదవ్, గురజాల కాంగ్రెస్ అభ్యర్థిగా తియ్యగూర యలమందారెడ్డి నామినేషన్ దాఖలుచేశారు. నామినేషన్ పత్రాలను వారు రిటర్నింగ్ అధికారి రమణాకాంత్‌రెడ్డికి అందజేశారు.

పెదకూరపాడు: స్వతంత్ర్య అభ్యర్థులుగా మామిడి వెంకట సత్య నారాయణమూర్తి, జై భీమ్ భారత్‌పార్టీ తరుపున సొరెకుక్క చిరంజీవి, స్వతంత్ర్య అభ్యర్థులుగా బంకా తిరుపతయ్య, శెట్టి శ్రీదేవి, బాణావత్ మురళీకృష్ణ నాయక్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున చిలక కోటేశ్వరరావు, నవోదయ పార్టీ తరుపున బంకా విజయ కుమార్‌లు వారి నామినేషన్‌లను ఆర్వో శ్రీరాములుకు అందించారు.

రెండు ఆటోలు ఢీ..నలుగురికి గాయాలు

రెంటచింతల, ఏప్రిల్ 24: రెండు ఆటోలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటన పాలువాయి సమీపంలోని గంగవరం మేజర్ వద్ద బుధవారం రాత్రి జరిగింది ఈ ఘటనలో కొండా రాములమ్మ, మేరావత్ సీతమ్మ, మల్లేశ్వరి, ముత్యాలమ్మల గాయాలయ్యాయి. వారిని మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో నరసరావుపేటకు తరలించారు.

మద్యం స్వాధీనం

పిడుగురాళ్ల, ఏప్రిల్ 24: పిడుగురాళ్ల సెబ్ అధికారులు బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీ చేశారు. పట్టణానికి చెందిన తమ్మిశెట్టి దుర్గాప్రసాద్, ప్రకాశంజిల్లా అర్ధవీడు మండలం పాపినేడిపల్లె గ్రామానికి చెందిన ఆలమూరు చినవెంకటేశ్వర్లు వద్ద నుంచి తెలంగాణ మద్యం 19 సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ సూర్యనారాయణ తెలిపారు.

వైసీపీ నేతలు ఓర్వలేక పోతున్నారు

● టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండండి

కారంపూడి, ఏప్రిల్ 24: మాచర్లలో కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి నామినేషన్ విజయవంతం కావడంతో వైసీపీ నేతలు ఓర్వలేకున్నారని, అందరూ అప్రమత్తంగా ఉండాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీపీ రమావత్ నాగుల్ నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షేక్ మోదీన్‌సా అన్నారు. బుధవారం కారంపూడిలో వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా వేలాదిగా ప్రజలు నామినేషన్ కార్యక్రమానికి స్వచ్ఛందంగా తరలివచ్చారన్నారు. దీంతో మాచర్ల పట్టణమంతా పసుపు మయంగా మారిందన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు లావు శ్రీకృష్ణదేవరాయలు, జూలకంటి బ్రహ్మారెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ నేత సయ్యద్ రహీం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు బాలునాయక్, హనుమాన్ నాయక్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాల్వ పేరయ్య, బీసీ సెల్ అధ్యక్షుడు గోరంట్ల నాగేశ్వరరావు, తెలుగు యువత అధ్యక్షుడు తుపాకుల చిన రత్తయ్య, లింగాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు



దొడ్లేరులో మాట్లాడుతున్న మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

పొలం హద్దురాళ్లపై జగన్ బొమ్మలేంటి ?

● అదేమైనా ఆయన తాత గారి జాగీరా..

● మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ధ్వజం

క్రోసూరు, ఏప్రిల్ 24: రైతులకు చెందిన పొలం హద్దు రాళ్లపై సీఎం జగన్ బొమ్మలు వేసుకోవటం ఏంటి.. అదేమైనా ఆయన తాత జాగీరా? అని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ధ్వజ మెత్తారు. క్రోసూరు మండలం దొడ్లేరులో మంగళవారం రాత్రి కూటమి నేతలతో పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కన్నా మాట్లాడుతూ.. జగన్ ప్రభుత్వంలో కోటీశ్వరులు నిరుపేదలయ్యారని, వైసీపీ నాయకులు మాత్రం కోటీశ్వరులయ్యారని విమర్శించారు. ఈ ప్రాంతంలో ఐదేళ్ల క్రితం ఎకరం భూమి కోటి రూపాయలు పలికితే, ఇప్పుడు కనీసం రూ. 15 లక్షల నుంచి రూ.20 లక్షలకు మించి ఉండటం లేదన్నారు. రాజధానిని విచ్ఛిన్నం చేసి అన్నివర్గాల ప్రజలను సర్వనాశనం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. రాష్ట్రానికి మళ్లీ పూర్వవైభవం రావాలన్నా, ప్రజల జీవితాలు మెరుగుపడాలన్నా కూటమి అధికారంలోకి రావాలన్నారు. దొడ్లేరులో ప్రజలందరూ ఆలోచించి టీడీపీకి ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో 20 సంవత్సరాల పాటు నియోజక వర్గంలో తనను ఆదరించినట్లే భాష్యం ప్రవీణ్‌ను ఆదరించాలని ఆయన కోరారు. సమావేశంలో క్రోసూరు మండల టీడీపీ అధ్యక్షుడు గుడిపాడు బాషా, మాజీ ఎంపీపీ అనుముల వెంకట రామిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు వై.విష్ణుమూర్తి, పలువురు బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నియోజక వర్గ ఉమ్మడి కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

నేడు భాష్యం ప్రవీణ్ నామినేషన్ ..

● వేలాదిగా తరలిరానున్న కూటమి నేతలు, కార్యకర్తలు

● పెదకూరపాడులో ఏర్పాట్లను పర్యవేక్షించిన భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 24: పెదకూరపాడులో పెదకూరపాడు నియోజక వర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను నామినేషన్ గురువారం ఉదయం నామినేషన్ వేయనున్నట్లు భాష్యం ప్రవీణ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గంలోని అన్ని మండలాల గ్రామాల నుంచి ప్రజలు వేలాదిగా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు బుధవారం పెదకూరపాడులో టీడీపీ నేతలు చేపడుతున్న ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. అమరావతి అంబేద్కర్ కూడలి నుంచి లింగాపురం, పరస, 75 తాళ్ళూరు పెదకూరపాడు అంబేద్కర్ సెంటర్ వరకు జరిగే ర్యాలీలో నియోజక వర్గ ప్రజలు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలి వచ్చి నన్ను ఆశీర్వదించాలని కోరారు. వేసవి దృష్ట్యా కార్యక్రమానికి వచ్చే ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏర్పాట్లను టీడీపీ, జనసేన, బీజేపీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

నియంతృత్వ పాలనకు చివరి రోజులు : భాష్యం ప్రవీణ్

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పాలన సాగించారని, ఆయన పాలనలో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ చేతగాని పాలనతో రాష్ట్ర ప్రజలకు కష్టాలు తప్పా ఒరిగిందేమి లేదని, రాష్ట్రాన్ని అన్ని విధాలుగా మోసం చేశారన్నారు. వచ్చే ఐదు సంవత్సరాల్లో రాష్ట్రానికి కొత్త శోభ సంతరించుకోవాలంటే అది చంద్రబాబు ద్వారా మాత్రమే సాధ్య మవుతుందన్నారు. నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే దోచుకోవటం దాచుకోవటం తప్పా చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. వైసీపీ దుర్మార్గపు పాలనతో ప్రజలంతా విసిగిపోయారని, నిత్యవసర వస్తువుల ధరలు పెరగటంతో మహిళలు అల్లాడిపోతున్నారని, మధ్య తరగతి ప్రజల జీవితం దుర్భరమైందన్నారు. ప్రజలు కనీసం నోరు విప్పి మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా పోయిందన్నారు. ఆయన వెంట పలువురు నియోజక వర్గ టీడీపీ నేతలు ఉన్నారు.

టీడీపీలోకి వైసీపీ ముఖ్య నేత..

క్రోసూరు, ఏప్రిల్ 24 : క్రోసూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన వైసీపీ ముఖ్య నేత ఉసిరికాయల శ్రీనివాసరావు బుధవారం టీడీపీ కూటమి అభ్యర్థి బాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. శ్రీనివాసరావు గతంలో అనంతవరం సర్పంచ్‌గా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించాడు. గౌడ వర్గాల్లో శ్రీనివాసరావుకు మంచి పట్టు ఉంది. శ్రీనివాసరావు టీడీపీలో చేరికతో గ్రామంలో టీడీపీ బలంపెరిగిందని స్థానికులు చెపుతున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పార్టీలో చేరిన వారికి సముచితస్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా ప్రవీణ్ అన్నారు. అందరూ ఐక్యంగా కృషి చేసి సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను, ఎంపీ అభ్యర్థిగా శ్రీకృష్ణదేవరాయలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అనంతవరం సర్పంచ్ పిల్లకతువుల రామయ్య, తోక వెంకటరావు తదితరులు ఉన్నారు.

నామినేషన్ కార్యక్రమానికి 300 వాహనాలు ..

భాష్యం ప్రవీణ్ నామినేషన్ కార్యక్రమానికి క్రోసూరు మండలం నుంచి 300 వాహనాల్లో జనం తరలి వెళ్తున్నట్టు మండల టీడీపీ అధ్యక్షులు గుడిపాడు బాషా తెలియజేశారు. ఒక్కొక్క గ్రామానికి 15 వాహనాల చొప్పున జనం పెదకూరపాడుకు తరలివెళ్తున్నామని, ఉదయం 9 గంటల నుంచి క్రోసూరు ఎన్‌టీఆర్ విగ్రహ వద్ద నుంచి భారీ ర్యాలీగా కార్లు, ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు నామినేషన్ కార్యక్రమానికి తరలి వెళ్తున్నట్టు తెలిపారు.

బెల్లంకొండ : భాష్యం ప్రవీణ్ నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి భారీగా తరలి రావాలని మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మండలం నుంచి సుమారుగా ఐదు వేల మంది నామినేషన్‌కు తరలి రావాలని సూచించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

అచ్చంపేట: భాష్యం ప్రవీణ్ నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లేందుకు అచ్చంపేట మండల నేతలు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. మండలం నుంచి భారీ సంఖ్యలో వాహనాలు సిద్ధం చేసుకున్నారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వచ్చేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. మండల నాయకులు నామినేషన్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నారు.

పల్నాడు వార్తలు

నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

ఆధారాలు చూపటంతో...

పట్టుకున్న నగదు తిరిగి అందజేత



రిటర్నింగ్ అధికారికి ధన్యవాదాలు తెలుపుతున్న రైతు నల్లపనేని సుబ్బారావు

చిలకలూరిపేట, ఏప్రిల్ 24: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తరలిస్తున్న నగదుకు ఆధారాలు చూపటంతో ఆ మొత్తాన్ని తిరిగి అధికారులు అప్పగించిన సంఘటన బుధవారం జరిగింది. ఈ నెల 13వ తేదీన పెదనందిపాడు మండలం అన్నవరం గ్రామానికి చెందిన నల్లపనేని సుబ్బారావు అనే రైతు కారులో రూ.9.30లక్షలు తీసుకు వెళ్తుండగా చిలకలూరిపేట రూరల్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. పోలీసులు ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఐతే ఆ రైతు ఈ మొత్తానికి సంబంధించి ఆధారాలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. పొలం కౌలు తాలూకు మొత్తాన్ని తీసుకు వెళ్తుండగా ఈ సంఘటన జరిగినట్టు రైతు తగిన ఆధారాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించారు. సంబంధిత కమిటీ కలెక్టర్ కార్యాలయంలో ఈ ఆధారాలను పరిశీలించిన మీదట అది వాస్తవమేనని ధృవీకరించటంతో కలెక్టర్ ఆ మొత్తాన్ని తిరిగి రైతుకు అందజేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో చిలకలూరిపేట అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి బీ నారదముని సమక్షంలో స్వాధీనం చేసుకున్న మొత్తాన్ని తిరిగి రైతు సుబ్బారావుకు బుధవారం సాయంత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సుబ్బారావు జిల్లా కలెక్టర్‌కు, రిటర్నింగ్ అధికారికి కృతజ్ఞతలు తెలిపారు.

దాడిలో గాయపడిన కార్యకర్తకు జీవీ పరామర్శ



వినుకొండ, ఏప్రిల్ 24: వినుకొండ నియోజకవర్గం ఈపూరు మండలం ఇనుమెళ్ళ గ్రామంలో వైసీపీ కార్యకర్తల దాడుల్లో గాయపడి టీడీపీ కార్యకర్తకు వినుకొండ నియోజకవర్గం తెలుగుదేశం జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి జీవీ ఆంజనేయులు పరామర్శించారు. బుధవారం నరసరావుపేటలోని నెల్లూరు సూపర్ స్పెషలిటీ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న బాధితుడిని పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జీవీ ఆంజనేయులుతో పాటు, వినుకొండ నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త కొంజేటి నాగశ్రీను, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నిశ్శంకర శ్రీనివాసరావు గారు, జిల్లా అధికార ప్రతినిధి రాపార్ల జగ్గారావు, ముఖ్య నాయకులు ఉన్నారు.



ఆరేపల్లి చెరువుకు గండిపడి బయటకు పోతున్న నీరు

ఆరేపల్లి తాగునీటి చెరువుకు గండి



నీరు పోకుండా అడ్డుకట్ట వేస్తున్న దృశ్యం

రొంపిచర్ల, ఏప్రిల్ 24: మండలంలోని ఆరేపల్లి రక్షిత తాగునీటి చెరువుకు బుధవారం గండి పడింది. కొద్ది రోజుల క్రితం తాగునీటి చెరువులకు నీటిని విడుదల చేశారు. చెరువుకు నీరు నింపారు. ఐతే చెరువుకు ఉన్న కట్ట తెగిపోవటంతో నీరు పొలాల్లో ప్రవహించింది. అంతేగాక చెరువుకు నీటిని నింపే కాలువ నుంచి నీరు చెరువులోకి ప్రవహిస్తూనే ఉంది. సమాచారం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని నీరు బయటకు పోకుండా బస్తాలను ఏర్పాటు చేయించారు. అంతేగాక చెరువులోకి నీరువచ్చే మార్గాన్ని నిలిపి వేశారు. కట్ట తెగటానికి గల కారణాలు తెలియ రాలేదు.

నీటిని తరలించిన రైతులపై ఫిర్యాదు

వినుకొండటౌన్, ఏప్రిల్ 24 : మండలంలోని నడిగడ్డ గ్రామ సమీపంలోగల చీకటీగలపాలెం మేజర్ కాల్వకు అక్రమంగా గండ్లు పెట్టి నీటిని తరలించిన వైసీపీకి చెందిన ఇద్దరిపై ఎన్ఎస్‌పీ ఏఈ ఉపేంద్ర మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అధికారుల అలసత్వంతో చెరువులకు చేరని తాగునీరు కథనాలపై ఎట్టకేలకు కలెక్టర్ స్పందించారు. సక్రమంగా విధులు నిర్వహించని సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎన్ఎస్‌పీ ఈఈని ఆదేశించారు. దీంతో మేజర్‌పై విధులు నిర్వహిస్తున్న స్థానిక అధికారులు నడిగడ్డ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడిపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పాతకక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన ఏడుకొండలు, ఆదినారాయణ వర్గీయులు ఒకరిపై ఒకరు దాడికి పాల్పడడంతో పరస్పరం ఒకరిపై ఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు.



నూతనంగా ప్రతిష్ఠించిన నీలకంఠేశ్వరస్వామి, బాలత్రిపురసుందరీదేవి, దక్షిణామూర్తి విగ్రహాలు

వైభవంగా విగ్రహాల, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

వేల్పూరు (శావల్యాపురం), ఏప్రిల్ 24: మండలంలోని వేల్పూరు గ్రామంలోని నీలకంఠేశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి దేవాలయాల్లో విగ్రహాల పునఃప్రతిష్ఠ, ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు కిరణ్‌శర్మ, శ్రీనివాసశర్మ, గ్రామపురోహితుడు తేవేకపల్లి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రెండు దేవాలయాల వద్ద యాగశాలలను ఏర్పాటుచేసి మూడ్రోజులపాటు పుణ్యదంపతులతో హోమాలు, యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతనంగా నిర్మించిన నీలకంఠేశ్వరస్వామి దేవాలయంలో నీలకంఠేశ్వరుడు, దక్షణామూర్తి, బాలత్రిపురసుందరీదేవి విగ్రహాలు, రామలింగేశ్వరస్వామి గుడి ముందు జీవధ్వజస్తంభాలను ప్రతిష్ఠించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అట్టహాసంగా జీవీ నామినేషన్



రోడ్‌షోలో పాల్గొన్న భారీ జనసందోహం, రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న గోనుగుంట్ల లీలావతి

నామినేషన్లు వేస్తున్న హరీష్, లీలావతి

వినుకొండ, ఏప్రిల్ 24: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి కూటమి వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా జీవీ ఆంజనేయులు బుధవారం నామినేషన్ వేశారు. ఈ నామినేషన్‌కు కూటమి నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వినుకొండ అంతటా ఎటుచూసిన టీడీపీ కార్యకర్తల సందడితో పసుపుమయం అయ్యింది. రోడ్‌షో ప్రారంభమైన దగ్గర నుంచి పూర్తయ్యేవరకు మండుటెండలో కాలినడకన కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యకర్తలు బాణాసంచా పేలుస్తూ సందడి చేశారు. నామినేషన్ అనంతరం జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గడిచిన ఐదు సంవత్సరాల్లో వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చేసిన అన్యాయానికి ఈ రోజు నా నామినేషన్‌కు వచ్చిన ప్రజలే నిదర్శనమని అని జీవీ ఆంజనేయులు అన్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా చేసిందని, మత్తు పదార్థాలకు బానిసులుగా మార్చిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించి ఆగిపోయిన అమరావతిని పునఃనిర్మిస్తామని, పోలవరం పూర్తిచేసి ఆంధ్ర రాష్ట్రాన్ని అన్నపూర్ణ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు.

లీలావతి, హరీష్ నామినేషన్లు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 24: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా బుధవారం ఆరుగురు వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి గోనుగుంట్ల లీలావతి, కుమారుడు హరీష్‌బాబులు టీడీపీ తరపున నామినేషన్ దాఖలు చేశారు.

శావల్యాపురం నుంచి ర్యాలీకి తరలిన టీడీపీ శ్రేణులు

శావల్యాపురం, ఏప్రిల్ 24: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి వినుకొండ ఎమ్మెల్యే అభ్యర్థిగా జీవీ ఆంజనేయులు బుధవారం నామినేషన్ దాఖలు చేస్తున్న సందర్భంగా మండలంలోని 15గ్రామపంచాయతీల నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు వేలాది మంది వినుకొండకు తరలివెళ్లి ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు ఆధ్వర్యంలో శావల్యాపురం సెంటర్లోని ఎన్టీఆర్, పరిటాల విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్ని గ్రామాల నుంచి ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు, కార్లలో శావల్యాపురానికి చేరుకొన్న కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి వినుకొండకు తరలివెళ్లారు. సైకో పోవాలి, సైకిల్ రావాలి అంటూ కార్యకర్తలు చేసిన నినాదాలతో హోరెత్తిపోయింది. వేల్పూరు, పొట్లూరు, కొత్తలూరు, కారుమంచి తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు బైకు ర్యాలీ నిర్వహించారు.

బొల్లాపల్లి మండలం నుంచి...

బొల్లాపల్లి, ఏప్రిల్ 24: బొల్లాపల్లి మండలం నుంచి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు నామినేషన్‌కు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వెళ్ళారు. డీజేలు, భారీ కాన్వాయ్‌తో వేలాదిగా తరలి వెళ్ళారు. నామినేషన్ సదర్భంగా మండల టీడీపీ కార్యకర్తలు అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలకు, అభిమానులకు అల్పాహారం, అన్నదానం భారీ చేశారు. ఈ సందర్భంగా ఎండ తీవ్రత దృష్ట్యా కార్యకర్తలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.



జీవీ నామినేషన్‌కు భారీగా వస్తున్న వెల్లటూరు వాసులు



కారుమంచిలో నామినేషన్‌కు బయలు దేరిన టీడీపీ శ్రేణులు

గంజాయి మత్తు వదలాలంటే...

సీఎం జగన్‌రెడ్డిని గద్దెదించాలి

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



పార్టీలో చేరిన వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 24: రాష్ట్రానికి పట్టిన గంజాయి మత్తును వదిలించాలంటే ముఖ్యమంత్రి జగన్‌రెడ్డిని గద్దెదింపి, వైసీపీని తరిమికొడితేనే అది సాధ్యమని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ కూటమి చిలకలూరిపేట అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. అభివృద్ధి చేయమని, ఉద్యోగాలు కల్పించమని ఒక్క అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని గంజాయికి కేరాఫ్‌గా మార్చిన దుర్మార్గుడు జగన్ అని ఆయన ధ్వజమెత్తారు. మంగళవారం చిలకలూరిపేట వైసీపీ నుంచి తెలుగుదేశంలో పార్టీలో చేరికలు జరిగాయి. ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో 6వ వార్డు నుంచి మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో 50కుటుంబాలు, యడ్లపాడు సాయి విఘ్నేశ్వర డ్రైవర్స్ గ్రూపునకు చెందిన 103కుటుంబాలు, వివిధ ప్రాంతాలనుంచి వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కొత్తపల్లికి చెందిన పది కుటుంబాలు, చంఘీస్‌ఖాన్‌పేటకు చెందిన 37 కుటుంబాలు వీరందరికీ ప్రత్తిపాటి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగుల అవస్థలకు త్వరలో చెల్లు: ప్రత్తిపాటి శరత్

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 24: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే యువత డిగ్రీలు చేతబట్టుకొని పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన అవస్థలు ఇక ఉండవని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ అన్నారు. సూపర్ - 6 హామీల్లో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు హామి ఇస్తున్న 20 లక్షల ఉద్యోగాలు, రూ.3వేలు నిరుద్యోగ భృతితో పాటు మండల కేంద్రాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ ఫెసిలిటీ కేంద్రాలు, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి శిక్షణ, పరిశ్రమలను, పెట్టుబడులను తిరిగి రప్పించటం ద్వారా స్థానికంగానే పెద్దఎత్తున ఉపాధి కల్పించేందుకు చంద్రబాబు నాయుడు ఆలోచన చేస్తున్నారన్నారు. బుధవారం పట్టణంలోని 9వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శరత్ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నాయకులు, కార్యకర్తలు పూలతో స్వాగతం పలికారు. తొలుత రజక కాలనీలో ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జాలయ్య కాలనీ, నెహ్రూ నగర్, రజక కాలనీల్లో ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. సైకిల్ గుర్తుకు ఓట్లువేసి ఎమ్మెల్యేగా ప్రత్తిపాటి పుల్లారావును, ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలను గెలిపించాలని కోరారు. ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును ప్రజలు బాధ్యతగా ఉపయోగించుకోవాలని శరత్ కోరారు.






ప్రత్తిపాటి పుల్లారావుకు మద్దతుగా చిలకలూరిపేటలో తనయుడు శరత్ ఎన్నికల ప్రచారం, గణపవరంలో టీడీపీ నాయకుల ప్రచారం

టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి

నాదెండ్ల, ఏప్రిల్ 24: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని టీడీపీ, జనసేన నాయకులు పేర్కొన్నారు. మండలంలోని గణపవరం గ్రామంలో గల రాజుల బజారులో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ 11 లక్షల కోట్లు అప్పులు చేసి సంక్షేమ పథకాల పేరుతో దోపిడీ చేశారని విమర్శించారు. భవిష్యత్ తరాల బాగు పడాలంటే కూటమితోనే సాధ్య మవుతుందన్నారు. సంపద సృష్టించి సంక్షేమం, అభివృద్ధి చేయగలిగే సమర్థత చంద్రబాబుకే ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, జనసేన నేత మండలనేని చరణ్ తేజ, నాయకులు జే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



కళాశాలలో జరిగిన శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు, పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ప్రసాదరావు తదితరులు

ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో రక్తదానం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 24: స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో గుంటూరు శ్రీ వెల్ఫేర్ బ్లడ్ బ్యాంక్, కళాశాల నేషనల్ సర్వీస్ స్కీమ్ యూనిట్ల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 25యూనిట్ల రక్తదానం జరిగిందని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు అన్నారు. ఈ సందర్భంగా మేదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్స్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 24: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బుధవారం 38 సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. నిందితుడు మండలంలోని జొన్నలగడ్డకు చెందిన కుందా నాగరాజును అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద నుంచి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 24: రైల్వే స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్ సమీపంలో ఓ వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్టు నరసరావుపేట రైల్వే ఎస్ఐ టీ సుబ్బారావు బుధవారం తెలిపారు. ఉదయం 8:30 గంటల సమయంలో స్వీపర్లు గుర్తించి స్టేషన్ మాస్టార్‌కు తెలిపారని, ఈ మేరకు కేసును సూపరింటెండెంట్ తమకు ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని శవ పరీక్ష నిమిత్తం పంపినట్టు ఆయన తెలిపారు. వృద్ధురాలి శరీరంపై ఎటువంటి గాయాలు లేవని, అనారోగ్యంతో మృతి చెందినట్టు భావిస్తున్నామని ఆయన తెలిపారు.

వేసవికి నీటి కొరత లేకుండా ఏర్పాట్లు

● కమిషనర్ సీహెచ్ గోవిందరావు



నాగార్జున సాగర్ కాలువ నుంచి చెరువులోకి తోడిపోస్తున్న నీరు

చిలకలూరిపేట, ఏప్రిల్ 24: చిలకలూరిపేట పట్టణానికి ఈ వేసవిలో నీటి కొరత లేకుండా అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని మునిసిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు బుధవారం తెలిపారు. నాగార్జునసాగర్ నుంచి చెరువును నింపటం కోసం విడుదల చేసిన నీటితో గత ఎనిమిది రోజులుగా రెండు తాగునీటి చెరువులను నింపుతున్నట్టుగా ఆయన తెలిపారు. మరో నాలుగు రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు రెండు తాగునీటి చెరువులను 60శాతం మేరకు నింపినట్టు ఆయన వెల్లడించారు. మరో పదిశాతం మేరకు నీటిని రానున్న నాలుగు రోజుల్లో నింపుతామని ఆయన తెలిపారు. ప్రస్తుతం నిల్వ ఉన్న నీటితో జూన్ నెలాఖరు వరకు ఎటువంటి సమస్య లేకుండా సరఫరా చేయవచ్చునని పేర్కొన్నారు. పట్టణంలో 34 వార్డుల పరిధిలో సుమారు 24వేల కుళాయిలు ఉన్నట్టుగా ఆయన తెలిపారు. ఇవి కాక నీటి సమస్య ఉన్న శివారు కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

తొమ్మిది మంది అభ్యర్థుల నామినేషన్లు

చిలకలూరిపేట, ఏప్రిల్ 24: చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి త్వరలో జరగనున్న ఎన్నికల్లో పోటీ కోసం బుధవారం తొమ్మిదిమంది తమ నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారి బీ నారదమునికి అందజేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మద్దుల రాధాకృష్ణ ర్యాలీగా వచ్చి తన నామినేషన్ దాఖలు చేశారు. సీపీఐ, సీపీఎం, కాంగ్రెస్ నాయకులు ఐదుగురితో కలపి ఆయన తన నామినేషన్‌ను దాఖలు చేశారు. వైసీపీ తరుపున కావటి మాధవి రెండు సెట్ల నామినేషన్‌లను దాఖలు చేశారు. నవతరం పార్టీ తరుపున రావు సుబ్రహ్మణ్యం తన నామినేషన్ దాఖలు చేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా తమ్ములూరి రమణయ్య రెండు సెట్ల నామినేషన్‌ను దాఖలు చేశారు. జాతీయ జనసేన పార్టీ తరుపున పసుపులేటి శ్రీనివాసరావు నామినేషన్‌ను వేశారు. వైసీపీ అభ్యర్థి కావటి శివనాగ మనోహర నాయుడు రెండు సెట్ల నామినేషన్‌లు వేశారు. రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ తరుపున షేక్ గౌస్ బాషా నామినేషన్‌ను వేశారు. కొప్పుల బాబూరావు బీఎస్పీ పార్టీ తరుపున నామినేషన్ వేశారు. మొత్తం తొమ్మిది మంది అభ్యర్థులు 13 సెట్ల నామినేషన్‌లను దాఖలు చేశారు.

85 మంది వలంటీర్ల రాజీనామా

చిలకలూరిపేట, ఏప్రిల్ 24: చిలకలూరిపేట మునిసిపాలిటీ పరిధిలో ఇప్పటి వరకు 85మంది వలంటీర్లు రాజీనామా చేశారు. పట్టణ పరిధిలో ఉన్న 29సచివాలయాల్లో మొత్తం 543 మంది వలంటీర్లు విధుల్లో ఉన్నారు. అత్యధిక మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేయటానికి ముందుకు రావటం విశేషం.

వైభవంగా విగ్రహ పునఃప్రతిష్ఠ

చిలకలూరిపేట, ఏప్రిల్ 24: చిలకలూరిపేట మండలం మానుకొండవారిపాలెంలో ప్రసన్నాంజనేయ సీతాలక్ష్మణసమేత కోదండ రామాలయంలో జీవ ధ్వజం పునః ప్రతిష్ఠ, అభినవ వేణుగోపాల స్వామి వారి ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రతిష్ఠా మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భారీ ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జరిగింది.



మానుకొండవారిపాలెంలో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

సబ్ జడ్జిగా పూర్ణిమ బాధ్యతల స్వీకారం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 24 : నరసరావుపేట ప్రధాన సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఏ పూర్ణిమ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె గుడివాడ నుంచి నరసరావుపేటకు బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ న్యాయాధికారిగా సేవలు అందించిన శోభారాణి కందుకూరుకు బదిలీ అయ్యారు.

మద్యం మత్తులో ఒకరి పై దాడి

నాదెండ్ల, ఏప్రిల్ 24: మద్యం మత్తులో కనపర్రుకు చెందిన పూదోట శౌరిబాబు అనే వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడిచేశారు. గ్రామానికి చెందిన శౌరిబాబు తన గేదెలకు మేత వేసేందుకు కొష్టం వద్దకు వెళ్ళాడు. అదే మార్గంలో ఆటోలో వస్తున్న కొందరు వ్యక్తులు శౌరిబాబును ఆటోతో గుద్దించే ప్రయత్నం చేశారు. ఈ విషయ మై ప్రశ్నించిన అతన్ని ఆటోలో ఉన్న బాలరాజు, గౌస్ బాషా, ఖాశింలు దాడి చేశారు. ఈ ఘటనలో శౌరిబాబు గాయపడగా చికిత్స కోసం నరసరావుపేట తరలించారు. నాదెండ్ల ఎస్ఐ బాల రామిరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.